## వికారాబాద్‌లో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ భవనం

**వికారాబాద్,అక్టోబరు 17, ప్రభాతవార్త:** జిల్లాలో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు అసెంబ్లీ స్పీ కర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురువారం పట్టణంలోని రాజీవ్ గృహకల్ప సమీపంలో భూమి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ భవన నిర్మాణాన్ని అర ఎకరం కెటాయించడం జరిగిందన్నారు. రూ.5కోట్ల వ్యయం అంచనాతో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. అనంతరం భవన నిర్మాణం యొక్క ప్లాన్‌ను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ప్రతీ క్‌జైన్, అదనపు కలెక్టర్ లింగనాయక్, ఎమెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఆర్డీఓ వాసుచంద్ర, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, ఐటీఐ ప్రిన్సిపాల్ నరేంద్ర బాబు పాల్గొన్నారు.



భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## మున్సిపల్ కార్మికుల తొలగింపుపై ధర్నా

**ఘట్‌కేసర్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్య కార్మికులను తొలగించడంతో వారు ధర్నా చేపట్టారు. పారిశుద్య కార్మికులు ప్రతిరోజు 8 గంటల పాటు పని చేస్తుండగా ఉదయం 4 గంటలు, మధ్యాహ్నం 4 గంటల పాటు విధులు నిర్వహించాలని కమీషనర్ సాబేర్‌ఆలీ ఆదేశించగా కార్మికులు వ్యతిరేకించారు. ప్రతిరోజు 8గంటల పాటు పనిచేస్తామని రెండుపూటలా పనులు చేయలేమని వారు చెప్పడంతో కమీషనర్ 140 మందిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించడంతో ఆందోళనకు దిగారు. కార్మికులకు మద్దతుగా ఎఐటీయూసి రాష్ట్ర నాయకులు జయచంద్ర కమీషనర్‌తో చర్చించి కార్మికుల సమస్యలను తెలియజేశారు. దీంతో కమీషనర్ రెండు పూటలా పారిశుద్య పనులు చేయాలని లేకుంటే విధుల్లోకి రాకూడదని ఆదేశాలు జారీ చేయడంతో కార్మికులు చేసేదేమి లేక మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా చేశారు. తమ సమస్యలు పరిష్కరించి తిరిగి విధుల్లోకి తీసుకునేవారకు ధర్నా కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు.

## అవినీతికి కేరాఫ్ ఫరూఖ్‌నగర్ రెవెన్యూ శాఖ

**షాద్‌నగర్, అక్టోబరు 17 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని ఫరూఖ్ నగర్ మండల రెవెన్యూ కార్యాలయం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. ఇటీవల కాలంలో అనేక సంఘటనలు చోటుచేసుకుంటూ నిత్యం వార్తల్లో నిలుస్తుంది. కార్యాలయంలో పనిచేసే సిబ్బంది స్థానికులే కావడంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా మారుతోంది. కేవలం ఒక్క రైతు చిన్న పాటి సమస్యకే ఆరున్నర లక్షల రూపాయలు లంచం తీసుకున్నారన్న సంఘటన ఇప్పుడు రంగారెడ్డి జిల్లా రెవెన్యూ యంత్రాంగాన్ని సైతం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. తాజాగా కార్యాలయంలో పనిచేస్తున్న రికార్డు అసిస్టెంట్ పోలె నరేందర్ బూర్గుల గ్రామానికి చెందిన కావలి అంజయ్య వద్ద 6.42 లక్షల రూపాయలు రికార్డు సవరణ కోసం సమర్పించడం తీరా డబ్బులు తీసుకున్నాక ఆ పని చేయకపోవడంతో స్థానిక తహసీల్దార్ పార్థ సారధికి లిఖితపూర్వక ఫిర్యాదు చేయడం జరిగింది. బాధితుడు కావలి అంజయ్య తన సమస్య పరిష్కారం కానందున ఫిర్యాదుకు రావడంతోనే ఈ అవినీతి విషయం వెలుగుచూసింది. ఇంకా కార్యాలయంలో అనేక అవి నీతి అక్రమ కార్యకలాపాలు ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయని అంటున్నారు. స్థానికంగా ఆర్డీవో కార్యాలయ అధికారి కూడా హెడ్ క్వార్టర్‌లోనే ఉన్నప్పటికీ సిబ్బంది ఎలాంటి అదురు బెదురు లేకుండా నిర్లజ్జగా రైతుల నుండి, ప్రజల నుండి పెద్దఎత్తున



ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం

డబ్బులు వసూలు చేస్తుండడం తీవ్ర విమర్శలకు దారి తీస్తుంది. గత రెండు నెలల క్రితమే ఫరూఖ్‌నగర్ రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది మధ్య అంతర్గత విభేదాలు ముదిరి కార్యాలయం ఎదుటనే ఆందోళన చేయడం, అదేవిధంగా విధి నిర్వహణను ఎగ్గొట్టి ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకోవడం మీడియా ముఖంగా వెలుగుచూసింది. ఈ అంశంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) విజయలక్ష్మిపై అధికారులు బదిలీవేటు వేశారు. మరికొంత మంది సిబ్బందికి శాఖాపరమైన చర్యలు చేపట్టారు. కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆనంద్ సింగ్ ఇక్కడ పనిచేస్తే తాము

- అవినీతిలో నిండా మునిగిన కార్యాలయం
- సిబ్బంది చేతివాటంతో అబాసుపాలు
- సిబ్బంది మధ్య విభేదాలు..
- రికార్డుల గల్లంతు

పనిచేసేది లేదంటూ నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది ధర్నా చేశారు. దీనిపై సిబ్బంది తగిన మూల్యమే చెల్లించుకుంది. ఆర్ఐ విజయలక్ష్మి బదిలీ అనంతరం ఆమె స్థానంలో నందిగామ నుండి మరో మహిళా ఆర్ఐ రోజాను నియమించారు. ఇదిలా ఉంటే కార్యాలయంలో ప్రజలకు పనులు జరగడం లేదని ఇటీవలే బీజేపీ స్థానిక నాయకుడు పాలమూరు విష్ణు వర్ధన్ రెడ్డి సైతం మీడియా ద్వారా ఆందోళన వ్యక్తం చేశారు. కార్యాలయంలో సిబ్బంది ప్రజలకు కావాల్సిన సరైన పత్రాలు ఇవ్వడం లేదని, కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిప్పించుకుంటున్నారని, డబ్బులు ఇస్తే పనులు తొందరగా అవుతున్నాయని, డబ్బులు ఇవ్వని పేదల పనులు పెండింగ్‌లో పెడుతున్నారని విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించిన సంగతి విధితమే. తాజాగా పాసుబుక్కులో సవరణ కోసం అర్జీ పెట్టుకున్న బూర్గులకు చెందిన రైతు కావలి అంజయ్య వద్ద రికార్డు అసిస్టెంట్ ఆరు లక్షలకు పైగా డబ్బులు తీసుకున్నాడనే ఫిర్యాదుతో అధికారులు సైతం అవాక్కయారు. అసలు ఈ కార్యాలయంలో ఏం జరుగుతోందని ప్రశ్నిస్తున్నారు. గతంలో రికార్డు అసిస్టెంట్ పోలె నరేందర్‌పై అనేక ఆరోపణలు ఉన్నట్లు రూఢీ అవుతుంది. రికార్డు సెక్షన్‌లో ఉద్దేశపూర్వకంగా రికార్డులను టాంపరింగ్ చేయడం, కొన్ని ముఖ్యమైన రికార్డులను చించివేశారన్న ఆరోపణలు సైతం లేకపోలేదు. ముఖ్యంగా పోలే నరేందర్ ఈ మండల పరిధిలోని బూర్గుల గ్రామానికి చెందిన స్థానికుడే కావడం గమనార్హం. ఇది తెలిసినా కూడా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. నరేందర్‌పై తహసీల్దార్ పార్థసారధి ఇప్పటికే విచారణకు ఆదేశించారు. ఏది ఏమైనప్పటికీ మండల రెవెన్యూ కార్యాలయంలో జరుగుతున్న వరుస సంఘటనలతో ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. జిల్లా కలెక్టర్ శశాంక దీనిపై స్పందించాలని కోరుతున్నారు.



వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించి నివాళులు అర్పించిన జిల్లా బిసి సహాయ అధికారి పి.రాజేశ్వర్, పలువురు అధికారులు,సిబ్బంది

## కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి వేడుకలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 17, ప్రభాతవార్త**

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని బిసి వెల్ఫేర్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించి ఘనంగ నివాళులు అర్పించారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని వెనకబడిన తరగతుల సంక్షేమ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారికంగ నిర్వహించారు. కలెక్టరేట్‌లో మహర్షి వాల్మీకి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాల వేసి ఘనంగ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి వెల్ఫేర్ అభివృద్ధి సహాయ అధికారి పి.రాజేశ్వర్, ఎఓ. ఎండి యూసుఫ్ అలీ, అధికారులు హనుమంతు, వాల్మీకి సంఘం అధ్యక్షులు రాజు, ఉపాధ్యక్షులు రాములు, ప్రధాన కార్యదర్శి, వాల్మీకి సంఘం నాయకులు వెంకటరమణ, లక్ష్మణ్, నర్సింలు, మద్దిలేటి, అయ్యన్న, సుధాకర్, నరసింహ, రవి, వెంకటయ్య, పన్ను రప్ప, జిల్లా వెనకబడిన తరగతులు అభివృద్ధి అధికారి కార్యాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

### ఘట్‌కేసర్ పురపాలక సంఘం ఆవరణలో ...



వాల్మీకిమహర్షికి పూజ చేసిన చైర్‌పర్సన్ పావనియాదవ్, కమీషనర్ సాబేర్‌ఆలీ, వైఎస్‌చైర్మన్ మాధవరెడ్డి

**ఘట్‌కేసర్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** భారత ఇతిహాసం రామాయణం రచించిన వాల్మీని ఎప్పటికి పూజించాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం మహర్షి వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా వాల్మీకి చిత్రపటానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాళ వేసి కొబ్బరికాయలు కొట్టి పూజించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనియాదవ్, కమీషనర్ ఎండి.సాబేర్‌ఆలీ, వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, కౌన్సిలర్లు కొమ్మిడి అనురాధ, బేతాల నర్సింగ్‌రావు, కోఆప్షన్‌సభ్యులు ఎస్‌కె.శౌకత్ మియా, మేనేజర్ ఎన్.వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి చిల్కూరి గోపాల్‌రెడ్డి, నాయకులు పల్లె విజయ్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



చెట్టువిరిగి ఆటోపై పడిన దృశ్యం

## ఆటోపై విరిగిన చెట్టు..డ్రైవర్‌కు గాయాలు

**ఘట్‌కేసర్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** ఆటోపై చెట్టు విరిగిపడగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. బీబీనగర్ మండలం మక్తా అనంతారం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ పెంటయ్య (60) ఘట్‌కేసర్ నుంచి భువనగిరికి ఆటోలో ప్రయాణికులను తరలిస్తుండగా మాధవరెడ్డి వంతెన దాటగానే రహదారి పక్కన చెట్టు కూలీ ఆటోపై పడింది. దీంతో డ్రైవర్ పెంటయ్యకు తలకు, పొట్టభాగంలో తీవ్రగాయాలు అయ్యాయి. ఆటోలో ఉన్న మరో మహిళకు స్వల్ప గాయాలు కాగా స్థానికులు గమనించి అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో వారు చేరుకొని ఆసుపత్రికి తరలించారు. గాయపడిన పెంట య్యకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉండగా ఆరు నెలల క్రితమే అల్లుడు మృతిచెందాడు. పోలీసులు, మున్సిపల్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఆటోపై రహదారిపై పడిన చెట్టును తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

## గ్రూపు-Iపరీక్షలకు 17,762మంది అభ్యర్థులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా, డిఆర్‌ఓ హరిప్రియ,అధికారులు

### మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 27పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 17, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో టిజిపిఎస్‌సి నిర్వహిస్తున్న గ్రూపు-1మెయిన్ పరీక్షలకు జిల్లా నుంచి 17,762మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా, డిఆర్‌ఓ హరిప్రియ, పలువురు అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి టిజిపిఎస్‌సి పరీక్షల నిర్వాహణకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో టిజిపిఎస్‌సి చైర్మన్ మహేందర్‌రెడ్డి, సభ్యులు తన కార్యాలయం నుంచి సచివాలయం నుంచి డిజిపి జితేందర్, టిజిపిఎస్‌సి కార్యదర్శి నవీన్ నీకోలస్, హైదరా బాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అయితే మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ కూడ సచివాలయం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగ జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగ 17,762మంది అభ్యర్థులు పరీక్షలు రాయటం జరుగుతుందని, ఈ పరీక్షల నిర్వాహణ కోసం 27పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ పరీక్షల నిర్వాహణ కోసం ఛీఫ్ సూపరిండెంట్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, జిల్లా అధికారులు, రూట్ ఆఫీసర్లకు ఈ నెల 15న సమావేశం నిర్వహించి విధి నిర్వాహణకు పలు సూచనలు, సలహాలు, ఆదేశాలు ఇవ్వటం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డిఆర్‌ఓ హరిప్రియ, పలువురు పాల్గొన్నారు.

## శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

### కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కడ్తాల్, అక్టోబరు 17 ప్రభాతవార్త :** మండలంలోని వంపుగూడ గ్రామంలో నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో గురువారం నిరక్షరాస్యత, నిరుద్యోగ యువతీ, యువకులకు, భవన నిర్మాణ రంగంలో శిక్షణా తరగతులు 15 రోజులుగా 30 మంది శిక్షణా ఎస్సీ సెల్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పోతుగంటి అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు శిక్షణ శిబిరాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ శిబిరాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వారన్నారు. కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాట నర్సింహ, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బిక్యానాయక్, బిచ్చనాయక్, హన్మనాయక్, భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌బాబా, జహంగీర్ అలీ, చందోజీ, చల్లా మహేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ట్రైనర్లు, ఎడి అంజయ్య, పుష్పాంజలి, ప్రభాకర్, లేబర్ కార్మికులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి రోడ్ల నిర్మాణానికి రూ.205కోట్లు

### విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి వెల్లడి

**ఆమనగల్లు, అక్టోబరు 17, ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసిందని కల్వ కుర్తి నియోజకవర్గ అధికార పార్టీ శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయ ణరెడ్డి అన్నారు. రోడ్ల భవనాల శాఖ, పంచాయతీ రాజ్‌శాఖల ద్వారా రూ. 205 కోట్లు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. మంజూరైన నిధులతో రెండు వరుసల రహదారుతో పాటు కొ్ట్ర-కల్వకుర్తి ప్రధాన రహదారిని నాలుగు వరుసల రోడ్ల అభివృద్ధికి వెచ్చించనున్నట్లు ఆయన తెలిపారు. ఆర్‌అండ్‌బీ నుండి రూ. 189 కోట్లు మంజూరుకాగా, పంచాయతీ రాజ్ శాఖ నుండి రూ. 16.25కోట్లు మంజూరయ్యాయని వివరించారు. గురువారం ఆమనగల్లు పట్టణంలోని కళ్యాణి గార్డేన్స్‌లో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రేస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా, మండల పార్టీ అధ్యక్షుడు తెల్గమళ్ళ జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విలేకరుల సమావేశంలో నిధుల మంజూరు గురించి మాట్లాడారు. ఈసంధర్బంగా ఆయన వివరాలు వెళ్ళడిస్తూ కల్వకుర్తి-మాధారం నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి రూ .30 కోట్లు, వెల్దండ-సిర్సనగండ్ల డబుల్ రోడ్డుకు రూ. 40 కోట్లు, జూపల్లి-వంగూరు గేట్ డబుల్ రోడ్డుకు 9కోట్లు, కోనాపూర్- మాడ్గుల డబుల్ రోడ్డుకు రూ. 45కోట్లు, మాడ్గుల-దేవరకొండ రెండు వరుసల రోడ్డుకు రూ. 30 కోట్లు, తలకొండపల్లి చౌరస్తా నుండి కొ్ట్ర గేటు వరకు రెండు వరుసల రోడ్డు నిర్మాణానికి రూ. 35కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ నుండి మాడ్గుల మండల కేంద్రంలో



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

సీసీరోడ్లు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణాలకు రూ. 9కోట్లు మంజూరయ్యాయని, ఆర్‌అండ్‌బీ ద్వారా రాచూర్ తండా- తిమ్మానిపల్లి గ్రామాల రహదారికి రూ. 2.25కోట్లు, మాచార్ల-యంగంపల్లి రహదారికి రూ. 5కోట్లు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వివరిం చారు. తండాలు, గ్రామపంచాయతీలను కలుపుతూ రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అదనంగా 100కోట్ల అంచనాలతో పంచాయతీరాజ్‌శాఖకు నివేదికలు పంపినట్లు ఆయన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రేస్ నాయకులు గూడూరు భాస్కర్‌రెడ్డి, హన్మనాయక్, గట్ల కేశవరెడ్డి, బిచ్యనాయక్, మోహన్‌రెడ్డి, వస్పుల శ్రీశైలం, అలీమ్, ఎంగలి ప్రసాద్, రాజశేఖర్, వస్పుల శ్రీకాంత్, మెకానిక్‌బాబా, విజయ్‌రాథోడ్, ఖాదర్, కృష్ణనాయక్, రహీమ్, ఢీగ్రీ కృష్ణ, ఫరీద్, విజయ్, గాజుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా బాలకిష్టారెడ్డి



బాలకిష్టారెడ్డి రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా నియమితులై నగరంలో బాధ్యతలు చేపట్టి పలువురి నుంచి అభినందనలు అందుకున్న దృశ్యం

**శామీర్‌పేట, అక్టోబరు 17, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి నియమితులు కావటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన నగరంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి నియమితులై బాధ్యతలు చేపట్టటంతో నల్సార్ లా యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు పలువురు హర్షం వ్యక్తం చేశారు. శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో సుమారు 25సంవత్సరాలు పాటు ప్రొఫెసర్‌గా, కొన్ని సంవత్సరాల పాటు రిజిస్ట్రార్‌గా పనిచేసి న్యాయవిద్యార్థుల నుంచి మంచి గుర్తింపును పొందారు. 2017లో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ప్రొఫెసర్‌గా అవార్డును వి.బాలకిష్టారెడ్డికి అందజేసింది. న్యాయశాస్త్ర రంగంలో నిపుణులుగా, న్యాయశాస్త్ర పరిశోధకులుగా వివిధ హోదాల్లో రాణించి అందరిలో మంచి గుర్తింపును ప్రొ.వి.బాలకిష్టారెడ్డి పొందారు. శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో పనిచేసి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా ప్రొ.వి.బాలకిష్టారెడ్డి నియమితులైన బాధ్యతలు చేపట్టటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేసి ఆయనకు అభినందనలు తెలియజేశారు. నల్సార్‌తో పాటు మహేంద్ర యూనివర్సిటీలోనూ ఆయన పనిచేసి అధ్యాపకుల, విద్యార్థుల నుంచి మంచి గుర్తింపును పొందారు. నల్సార్‌లో చదివిన న్యాయవాదులు, న్యాయవిద్యార్థులు, పలువురు అధ్యాపకులు కలిసి ఆయన పుష్పగుచ్చంలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**పరిగి అక్టోబరు17,ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం పూడరు గేట్ సమీపంలో గురువారం బైకుబస్సు ఢీ కోనడంతో ముగ్గురు యువకులు మృతి చెందారు. విషయం తెలుసు కున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మృతుల కుటుంబాలను పరామర్శించి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అంత్యక్రియలకు వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి యువకులు మరణించడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

**వికారాబాద్ రూరల్,అక్టోబర్ 17 ప్రభాతవార్త** వాల్మీకి జయంతి వేడుకలు గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అదన పు కలెక్టర్ లింగ్యానాయక్ అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి ముఖ్య అతిధులుగా పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూల మాలలువేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ దినం జాతిని గుర్తుంచుకునే రోజు ప్రపంచం ఉన్నంతవరకు రామాయణం వాల్మీకి చరిత్ర ఉంటుందని ఇతిహాసాల్లో మొదటిది రామయణం పెద్దది మహాభారతం. అలాంటి రామాయాణాన్ని రచిం చింది ఒక బో య కులానికి చెందిన చోరుడు అయిన వాల్మీకి అని ఆయన ఇచ్చిన స్ఫూర్తితోతో అనేక మంది రచయితలుగా కవులుగా మారారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి మల్లేశం డిపిఆర్‌ఓ చెన్నమ్మ గిరిజన అభివృద్ధి అధికారి కమలాకర్ రెడ్డి జిల్లా వెనకబడిన తరగతులు అసిస్టెంట్ అధికారి భీమ్‌రావు కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప మందిరంలో పూర్ణాహుతి కార్యక్రమంలో భక్తులు

## ఘనంగా దక్షిణమూర్తి విగ్రహ ప్రతిష్టాపన

**షాద్‌నగర్, అక్టోబరు 17 ప్రభాతవార్త :** పట్టణంలోని శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో గురువారం వేద మంత్రోచ్చరణల మధ్య శ్రీ దక్షిణ మూర్తి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా భక్తులు దేవాలయ ప్రాంగణంలో పూర్ణాహుతి కార్యక్రమంలో ఉత్సా హంగా పా ల్గొన్నారు. గురుస్వామి గిరీషన్ నాయక్, కమిటీ అధ్య క్షులు లష్కర్, ఆంజనేయులు, కార్యదర్శి రేటిక ల్ నందీశ్వర్, కోశాధికారి దాస కృష్ణయ్య, వెం కట్‌రాంరెడ్డి, ఈశ్వరప్ప, రేటికల్ చంద్రకాంత్, మేకల సత్యనారాయణ, మేకల రాంచంద్రారెడ్డి, దేవేందర్ రెడ్డి, రమేష్, సత్యనారాయణ, లింగమప్ప, ప్రభా కర్, కృష్ణయ్య, శివయ్య, అంజయ్య, శేఖర్ రెడ్డి, ఆగీరు అనిల్, నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్య తలెత్తకుండా చూస్తాం

### వార్తకు స్పందన

**ధారూర్,అక్టోబర్ 17 ప్రభాతవార్త** గ్రామాలలో నీటి సమస్య తలెత్తకుండా చూస్తామని మిషన్ భగీరథ అధికారులు అన్నారు. శుక్ర వారం మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అనే శీర్షికతో ప్రచురితమై వార్తకు భగీరథ అధికారులు స్పందించారు. మండల పరిధి లోని దోర్నాల్ తండా గేట్ సమీపంలో లీకేజీకి గురైన పైప్‌లైన్‌కు గురువారం మరమ్మతులు చేశారు.



పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న మిషన్ భగీరథ అధికారులు

## గాయత్రినగర్‌లో మహిళలకు ప్రత్యేక జాబ్ మేళా

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 17, ప్రభాతవార్త**

అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లో మహిళలకై ప్రత్యేక జాబ్ మేళా నిర్వస్తున్నామని నిర్మాణ్ ఎన్జీఓ సంస్థ ప్రతినిధి ప్రకాష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారీస్‌తో సంయుక్తంగా తాము ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ అర్హత కల్గిన మహిళలకు ప్రత్యేకించి ఈ జాబ్ మేళా ఏర్పాటు చేశామని, ప్రముఖ ఐటీ కంపెనీలతో పాటు ఉత్పాదక రంగం, ఐటీస్, రిటైల్, ఫార్మా, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, బీపీఓ రంగాల నుంచి అనేక కంపెనీలు రిక్రూట్‌మెంట్ చేయనున్నామని తెలిపారు. ఉత్తీర్ణతలు కల్గిన అభ్యర్థులకు స్పాట్ ఆఫర్లు అందజేస్తారని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు శుక్రవారం ఉదయం గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు గాయత్రినగర్ హరిహర క్షేత్రం దేవస్థానం సమీపంలోని ప్లాట్ నెం.42కు రావాల్సిందిగా కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు ఫోన్ నెం.91541 45734కు కాల్ చేయాలని సూచించారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 28లోపు ఉండాలని, విద్యార్హతలు తెలిపే విధంగా రెజ్యూమెతో పాటు టెన్త్, ఇంటర్, డిగ్రీ సర్టిఫికేట్లు, ఆధార్, 2 పాస్‌పోర్టుసైజు ఫొటోలు వెంట తెచ్చుకోవాలని నిర్మాణ్ ఎన్జీఓ ప్రతినిధులు సంపత్, ప్రకాష్ తెలిపారు.

## బస్తీల అభివృద్ధి కోసమే సొసైటీ ఏర్పాటు

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 17, ప్రభాతవార్త**

ఎస్పీఆర్ హిల్స్‌లోని ఉమ్మడి బస్తీలను అభివృద్ది పర్చుకునేందుకు ఉమ్మడి బస్తీల డెవలప్‌మెంట్ ఫెడరేషన్ సొసైటీని ఏర్పాటు చేసుకోవటం జరిగిందని నూతన అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన జంగిటి పుల్లని జ్ఞానేశ్వర్ అన్నారు. ఇందుకు గాను రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని శివమ్మ పాపిరెడ్డి హిల్స్‌లో సమావేశం నిర్వహించారు. శివమ్మపారిరెడ్డి హిల్స్(ఎస్పీఆర్ హిల్స్) ఉమ్మడి బస్తీల డెవలప్‌మెంట్ ఫెడరేషన్ సొసైటీని పేదలపాలిటి ఆత్మబంధువైన మాజీ మంత్రి సీఎల్పీ నాయకుడు పీ జనార్ధన్‌రెడ్డి ప్రోత్సాహంతో 1994 సంవత్సరంలో 448 నెంబర్‌లో రిజిస్ట్రర్ నమోదైన ఈ సంఘంను తిరిగి ముక్తకంఠంతో అన్ని బస్తీల సహకారంతో అభివృద్దిపర్చుకునేందుకు సెంట్రల్ కమిటీ అనబడే ఉమ్మడి బస్తీల కమిటీని పునరుద్దరించడం జరిగిందని తెలిపారు. ఈ ఫెడరేష్ సొసైటీకి అధ్యక్షునిగి మహాత్మానగర్ వ్యవస్థాపన అధ్యక్షులు జంగిటి పుల్లని జ్ఞానేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడమైంది. జ్ఞానేశ్వర్ తన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో సలహదారులను, వర్కింగ్‌ప్రెసిడెంట్లను, అడిషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను, ఉపకార్యదర్శులను, ఆర్గనైజింగ్ సెక్రటరీలను, కోశాధికారిని నియమించారు. ఎస్సిఆర్ హిల్స్‌లోని 25 బస్తీలలో ఈ ఫెడరేషన్ సొసైటీ ప్రజలు సూచించే కార్యక్రమాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి అండదండలతో, సహకారంతో ముందుకు వెళ్లడం జరుగుతుందని పేర్కొన్నారు.

## వ్యాపారులతో జూబ్లీహిల్స్ పోలీసుల సమావేశం..

**పంజగుట్ట, అక్టోబర్ 17 ప్రభాతవార్త:**

ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా జూబ్లీహిల్స్ పోలీసులు వ్యాపారులతో ముందస్తుగా సమావేశమయ్యారు. చికెన్, మటన్, బీఫ్ వ్యాపారులతో గురువారం జూబ్లీహిల్స్ పోలీసులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి షాపులోనూ లోపల బయట రెండు సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మాంసం వ్యర్థాలను రోడ్లపై చెత్తకుప్పల్లో వేయకుండా కవర్లలో ప్యాక్ చేసి డంపింగ్ యార్డుకు పంపే విధంగా చూడాలన్నారు. వ్యర్థాలను నిర్లక్ష్యంగా పడవేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో డీఐ మధుసూధన్, ఎస్ఐలు జానయ్య, హరీశ్వరరెడ్డి, స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు.

## క్యాథలిక్ గ్రేవ్ యార్డులో వసతులు కల్పిస్తాం

**-ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన క్యాథలిక్ గ్రేవ్ యార్డు నిర్వాహకులు

**సికింద్రాబాద్, అక్టోబర్ 17 ప్రభాతవార్త:** నవంబర్ 2న నిర్వహించే హోల్ సోల్స్ డే పవిత్ర ఆత్మల దినోత్సవం సందర్భంగా అన్ని ఏర్పాట్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం బన్సీలాల్‌పేట్‌లోని బోయిగూడ క్యాథలిక్ గ్రేవ్ యార్డ్ నిర్వాహకులు తలసాని శ్రీనివాస్ యాదవ్ కార్యాలయంలో కలిసి హోల్ సోల్స్ డే పవిత్ర ఆత్మల దినోత్సవం సందర్భంగా గ్రేవ్ యార్డుకు వేలాదిమంది వస్తారని, వారు ఎలాంటి అసౌర్యానికి గురికాకుండా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వసతులు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ గ్రేవ్ యార్డును శుభ్రపర్చడం, లైటింగ్, చెత్త, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా అధికారులను ఆదేశిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, ఫాదర్ ఆరోగ్యం హుజీ టార్చర్ జయరాజ్, పియర్ డిసిల్వా, సదాయ్‌రాజ్, నేతలు వెంకటేషన్ రాజు పాల్గొన్నారు.

## బాలికలు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు

**-డిఎల్ఎస్ఎ కార్యదర్శి,సెషన్ జడ్జి అరుణ కుమారి**



కార్యక్రమంలో పాల్గొన్న డిఎల్ఎస్ఎ కార్యదర్శి, సెషన్ జడ్జీ అరుణ కుమారి,

**చార్మినార్,అక్టోబరు 17 ప్రభాతవార్త :**

బాలికలు అన్ని రంగాలలోను రాణించ వలసిన అవసరం ఎంతైనా ఉందని హైదరాబాద్ డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ ఆధారిటీ కార్యదర్శి,సెషన్ జడ్జీ అరుణ కుమారి అన్నారు.పాతబస్తీ దూద్‌బౌలిలోని అశ్రిత హోమ్‌ను గురువారం ఆమె సందర్శించారు.బాలికలకు పలు అంశాలపై జడ్జీ అరుణ కుమారి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జడ్జీ అరుణ కుమారి మాట్లాడుతూ బాలికలు మంచి క్రమ శిక్షణ,పట్టుదలతో చదువుకుంటే తప్పకుండ ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు.బాలికలు తమ ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె తెలియజేశారు.ఈ కార్యక్రమంలోపిఒఐసి విజయ్ భాస్కర్,ఎస్ఐ భాస్కర్,సత్యనారాణ,అశ్రిత హోం ప్రోగ్రామ్ కన్వీనర్ వి.పర్వతాలు,టీమ్ సభ్యులు రాజేష్,స్వప్న,శిరీష, హెలెన్,శివమ్మ, నాగమణితో పాటు పలువురు పాల్గొన్నారు.

## మనుషుల అక్రమ రవాణ నిర్మూలనలో అందరం భాగస్వాములవుదాం

**- నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్**



నార్సింగిలో ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా తరగతుల ముగింపు సమావేశంలో పాల్గొన్న చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్.

**నార్సింగి, అక్టోబర్ 17 ప్రభాతవార్త :** మనుషుల అక్రమ రవాణా నిర్మూలనలో అందరం భాగస్వాములం అవుదామని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ శేరిలింగంపల్లి ప్రాజెక్టు ఆధ్వర్యంలో నార్సింగిలో రెండు రోజుల శిక్షణా తరగతుల ముగింపు సమావేశం జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన నాగపూర్ణ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణ ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తుందని, వేలాది మంది యువతల జీవితాలను చిదిమేస్తుందన్నారు. ఈ అక్రమ రవాణాకు పేద, మధ్య తరగతికి చెందిన యువతులే సమిధలవుతున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు పేద యువతులకు మానవ అక్రమ రవాణా అంశంపై అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ ట్రాకింగ్ చాలా వేగంగా విస్తరిస్తుందని, యుక్త వయసులో ఉన్న బాలికలు, యువతులకు ఫోన్‌లు దూరంగా ఉంచాలని, ఫోన్ ద్వారా జరిగే నష్టంను వివరించాలన్నారు. సిడిపిఓ కవిత మాట్లాడుతూ ఈ మానవ అక్రమ రవాణాను ఆదిలోనే అడ్డుకుంటే ఆడ పిల్లలను రక్షించుకోవచ్చని తెలిపారు. ఉద్యోగం, ప్రేమ ,పెళ్లి,సినిమా అవకాశాల పేరుతో పేద, మధ్య తరగతికి చెందిన యువతలను ఉచ్చులోకి లాగి మోసం చేస్తున్నారన్నారు. అనంతరం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ మాట్లాడుతూ ప్రజ్వల సంస్థ గత 28.ఏళ్లుగా లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పని చేస్తుందని, ఇప్పటి వరకు 28,600 మంది యువతులను కాపాడి పునరావాసం కల్పించామని వివరించారు. యువతులను జాగృత పరిచి, మోసపోకుండా కాపాడుకునేందుకు ప్రజ్వల సంస్థ నిరంతరం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్‌లు నీలవేణి, ఇందిరా రాణి, ఉమారాణి, పద్మ, పద్మజ ప్రజ్వల ప్రతినిధులు సురేష్, ఒబర్‌సింగ్, చెన్న కేశవ్, ఆశ్రిత, దశరత్, ఉమా మహేశ్వరి, రజిత తదితరులు పాల్గొన్నారు.

## మంచిమనస్సున్న మహరాజు దుగ్గిరాల సోమేశ్వరరావు

**-తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**



దుగ్గిరాల సోమేశ్వరరావు ఆత్మీయ పురస్కారగ్రహీతలతో హెచ్.జె.దొర, కె.వి.రమణాచారి, సారిపల్లి, శాస్త్రి, మోహనసేనాపతి తదితర అతిథులు

**నాంపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త :** దుగ్గిరాల సోమేశ్వరరావు గొప్పనటుడు, దర్శకుడు, కవి, రచయిత, వ్యాసకర్తగా బహుముఖీన ప్రతిభావంతుడు అన్నింటికీ మించి మంచిమనస్సున్న మహరాజు అని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. కళ భగవత్‌దత్తమని, అందరికీరాదని, భగవంతుడి ఆశీస్సులుంటే అది సాధ్యమని అన్నారు. ఏమాత్రం అహంకారం లేకుండా ఒదిగివుంటూ ఎదుటివాడు ఎదుగుతూ ఉంటే ఆనందించే మనస్తత్వమున్న మహానుభావుడని, ఎంతోమంది నటీనటులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ టెలిఫోన్ సంస్థ ఉద్యోగిగా ఇంజనీర్‌గా పనిచేస్తూ ఎన్నో భవనాలు కట్టించినా పేర్గాంచిన సైఫాబాద్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ భవన నిర్మాణం ఆయన్ను కలకాలం గుర్తుచేస్తుందంటూ ప్రభుత్వంలో ఉండి ఏంచేసామని కాదు, చేసినపని ఎంతవరకు నిలిచి ఆదరణ పొంది మేలుజరిగిందనేది ముఖ్యమన్నారు. దుగ్గిరాల సోమేశ్వరరావు ఏపనైనా అంకితభావం, దీక్ష, సమయ పాలనతో చేసే మహోన్నత రంగస్థల నటుడు, దర్శకుడని విశ్రాంత డిజిపి హెచ్.జె.దొర ఘననివాళులర్పిస్తూ ఆయన పేరున రంగస్థల ప్రముఖులకు పురస్కారాలివ్వడం ఆనందంగా, ఆయన్ను స్ఫూర్తిగా ఉందని కొనియాడారు. రసరంజని, హైదరాబాద్, దుగ్గిరాల కుటుంబం సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ప్రఖ్యాత నటుడు, దర్శకుడు, ఎన్‌టిఆర్ అవార్డు గ్రహీత దుగ్గిరాల సోమేశ్వరరావు 92వ జయంతి వేడుకలను పురస్కరించుకొని పలువురు రంగస్థల ప్రముఖులకు దుగ్గిరాల ఆత్మీయ పురస్కారాలను ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. గురువారం రాత్రి సారిపల్లి కొండలరావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ డిజిపి హెచ్.జె.దొర విచ్చేసి సభాప్రారంభకుడు డా. కె.వి. రమణాచారి, ఆత్మీయ అతిథులు బి.ఎం.రెడ్డి, ఎం. కామేశ్వరరావు, సోమేశ్వరరావు కుమారుడు డా. డిజిపి.శాస్త్రి, మోహన సేనాపతి తదితరులతో కలిసి సీనియర్ రంగస్థల నటులు సిహెచ్.నారాయణస్వామి, సుసర్ల కామేశ్వరశర్మ, కేతినీడి నటరాజ్, సత్కళాభారతి జి.సత్యనారాయణ, డా. బిహెచ్.పద్మప్రియలను ఘనంగా సత్కరించి రసరంజని దుగ్గిరాల సోమేశ్వరరావు ఆత్మీయ పురస్కారం ప్రదానంచేసి అభినందనలు తెలిపారు.

## 19న చార్మినార్ వద్ద సద్భావనా యాత్ర స్మారక దినోత్సం

**-మాజీ మంత్రి గీతారెడ్డికి సద్భావనా అవార్డు ప్రధానం**

**చార్మినార్,అక్టోబరు 17 ప్రభాతవార్త :** రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమితి ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన చార్మినార్ వద్ద జరగనున్న సద్భావనా యాత్ర స్మారక దినోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి,టిపిసిసి వర్కింగ్ ప్రెశిడెంట్ డాక్టర్ జె.గీతారెడ్డికి సద్భావనా అవార్డును ప్రధానం చేయనున్నామని రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమితి ప్రధాన కార్యదర్శులు జి.ఆనంద్,సయ్యద్ ముజాహిద్ హుస్సేని,సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్యలాల్ తెలిపారు.శనివారం ఉదయం 10.30 గంటలకు చార్మినార్ వద్ద రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక దినోత్సం ఉత్సవాలకు జరుగుతాయని వారు తెలియజేశారు.టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ గౌడ్ పార్టీ పతాకాన్ని ఎగురు వేయనున్నారని,రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,రాష్ట్ర కాంగ్రెస్ ఇంఛార్జి దీపాదాస్ మున్షీ,రాష్ట్ర మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి,పొన్నం ప్రభాకర్, దామోధర్ రాజా నర్సింహ్మాడి.శ్రీధర్ బాబు, డి.శీతక్క, మాజీ ఎంపి వి.హనుమంతరావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటున్నారని వారు తెలిపారు .కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన వారు విజ్ఞప్తి చేశారు.మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ 1990 అక్టోబరు నెల 19వ తేదీనచార్మినార్ నుంచి సద్భావనా యాత్ర ప్రారంభించారని,అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం చార్మినార్ వద్ద సద్భావనా యాత్ర స్మారక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, వారు తెలిపారు.ప్రతీ సంవత్సరం చార్మినార్ వద్ద జరిగే కార్యక్రమంలో సద్భావనా అవార్డును సమితి తరుపున ప్రధానం చేస్తున్నామని, ఈ ఏడాది మాజీ మంత్రి టిపిసిసి వర్కింగ్ ప్రెశిడెంట్ డాక్టర్ జె.గీతారెడ్డికి సద్భావనా అవార్డును ప్రధానం చేయనున్నామని వారు వెల్లడించారు.

## ఎవ్వరూ అధైర్య పడొద్దు అండగా ఉంటా : ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**-మూసి పరీవాహక ప్రాంతాల్లో ఎంపి, బిజెపి నేతల పర్యటన**



**అత్తాపూర్ అక్టోబరు17,ప్రభాతవార్త :**

ముసి పరివాహక ప్రాంతాల ప్రజలు ఎవ్వరూ కూడా అధైర్య పడొద్దని అన్ని విధాలుగా అండగా ఉంటామని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్‌లోని అత్తాపూర్ డివిజన్ ముసి పరివాహక భరత్ ,టికెఆర్ కాలనీలలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి ,చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్,రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌లతో కలిసి ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి పర్యటించారు.ఈ మేరకు అధికారులు ఇండ్లకు మార్కింగ్ వేయడంతో ఆ బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఎంపి కొండా మాట్లాడుతూ....అధికారులు 5 ఏళ్ల క్రితం అన్ని విధాలుగా హద్దులు సర్వే నిర్ణయించారని ఇది ఉంది కబట్టే పేద ఇండ్లు నిర్మించుకున్నారని ఇప్పుడు కొత్తగా వచ్చి మార్కింగ్ వేయడం దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ఇండ్ల కూల్చివేతలపై కొండా విశ్వేశ్వర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.పేదల ప్రజల మీద ప్రభుత్వం పెత్తనం చూపవద్దని కోటీశ్వరులపై చూపాలని సూచించారు. ఎంతో కష్టపడి రూపాయి రూపాయి కూడా పెట్టి ఇండ్ల నిర్మించుకున్నారని ఇప్పుడు వారి ఇండ్లను కూల్చి రోడ్ల మీద పడిస్తే వారు ఎక్కడికి వెళ్లాలన్ని పేద ప్రజల జోలికి వస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు.పేదల భాదను పట్టించుకోకుండా ప్రభుత్వం బలవంతంగా కూల్చివేతలకు పాల్పడితే లక్ష మందితో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఇళ్లు కొల్పొతున్న ప్రతి ఒక్కరికి మూడింతలు పరిహారం చెల్లించాకే ఇళ్లు ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు.పేద ప్రజలు ఎవ్వరూ భయపడోద్దని వారికి అన్ని విధాలు అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు,ముసి బాధితులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వివేకానందను కలిసిన బిఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

**పేట్ బషీరాబాద్, అక్టోబర్ 17, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ఉద్యమకారులు సంపత్ మాధవరెడ్డి, గుమ్మడి మధుసూదనరాజులు గురువారం ఎమ్మెల్యే కెపి వివేకానంద గౌడ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 132 డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సూదల సంపత్ గౌడ్, తోకల నగేష్‌రెడ్డి, ఎల్లయ్యగౌడ్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికను వ్యభిచారం చేయమని కన్న తల్లి ఒత్తిడి

**-ఇంటి నుంచి పరారీ..పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు**

**అల్వాల్,అక్టోబరు 17 ప్రభాతవార్త:**

కన్న తల్లి మైనర్ కూతురిని వ్యభిచారం చేయమని ఒత్తిడి చేయడంతో ఇంటి నుంచి పరారై పోలీసులు శరణు కోరింది. ఇది తెలిసిన బాలిక తల్లి తన అనుచర గణంతో పోలీసు స్టేషన్‌కు వచ్చి సిబ్బందితో వాగ్వివాదానికి దిగడం చర్చాంశనీయంగా మారింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అల్వాల్ వెంకటాపురంలో నివసించే నాగినా(40) మైనర్ కూతురిని వ్యభిచారం కూపంలోకి లాగడానికి ప్రయత్నించింది. భయంతో మైనర్ బాలికి ఇంటి నుంచి తప్పించుకుని అల్వాల్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నాగినాపై ఫోక్సో సెక్షన్‌లు కింద కేసు నమోదు చేసి గురువారం జైలుకు పంపించారు. బాలికను సఖి సెంటర్‌కు తరలించడం జరిగింది.

## వార్ధక్య ఆలోచనే మనసుని ముసలివారిని చేస్తుంది : సినీనటుడు ప్రదీప్



సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త:**

వార్ధక్య ఆలోచనే మనసుని ముసలివారిని చేస్తుందని, అందుచే కృష్ణశాస్త్రి కవిలో చెప్పినట్లు పదుచుగుండె ఎప్పటికీ ఉండేలా చూసుకోవాలని ప్రముఖ సినీనటుడు ప్రదీప్ అన్నారు. గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వార్షికోత్సవ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా సినీనటుడు ప్రదీప్ హాజరై సీనియర్ సిటిజన్స్ సిక్స్‌ప్యాక్ సూత్రాలను పాటించాలన్నారు. శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం, ఆర్థిక స్వాతంత్ర్యంపైన ఒకరు ఉన్నారన్న నమ్మకంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, మానవ సంబంధాలు కొనసాగించడం, తనకుతానే ప్రేరణ పొందడం ప్రతి వయోధికుడు పాటిస్తే జీవితం ఆనందమయం అని అన్నారు. ప్రధాన కార్యదర్శి మాచెర్ల రంగయ్య నివేదికలో పద్నాలుడు ఏళ్ల క్రితం తమ అసోసియేషన్ ఆరంభమైందన్నారు. అధ్యక్షత వహించిన అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లయ్య తమ సంస్థ నిర్వహించిన సేవా కార్యక్రమాలను వివరించారు. సంయుక్త కార్యదర్శి నరసింగరావు స్వాగతం పలుకగా మురళీధర్, చంద్రబోస్, అభినందన భవానీ, పూర్వ డిఆర్ఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. తొలుత జైహింద్ సంస్థ సభ్యులు పలు సినీ గీతాలను ఆలపించారు. వివరించారు.

## మాజీ మంత్రి కెటిఆర్‌ను కలిసిన బిఆర్ఎస్ నేతలు



మాజీ మంత్రి కెటిఆర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్ విఎస్ఆర్ తదితరులు

**చిక్కడపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త:**

బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న సీనియర్‌లను విస్మరించే ప్రసక్తేలేదని మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పష్టం చేశారు. గురువారం రామ్‌నగర్ మాజీ కార్పొరేటర్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వి.శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు కల్వగోపి, అజయ్ ముదిరాజ్, జోగిందర్, సిరిగిరి శ్యామ్, ఆటో శ్రీను, రమేష్, సిరిగిరి కిరణ్, బాలరాజ్ గౌడ్, సదా, సత్యనారాయణ, వెంకటేష్, శివ, మధు తదితరులతో పాటు పెద్దసంఖ్యలో కెటిఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీకి అంకితభావంతో పనిచేసే వారిని తప్పక గుర్తిస్తుందన్నారు. ప్రభుత్వ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరచాలని సూచించారు.

## నాచారంలో ఎమ్మెల్యే బిఎల్ఆర్ పర్యటన



సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, అక్టోబర్ 17 ప్రభాతవార్త:**

నాచారం డివిజన్ పరిధిలోని పటేల్ కుంట చెరువును అధికారులతో కలిసి ఎమ్మెల్యే బిఎల్ఆర్ పర్యటించారు. రూ. 80 లక్షల వ్యయంతో పటేల్ కుంట చెరువు వద్ద నిర్మించిన సివరేజ్ డైవర్షన్ పనులు పూర్తి అయినా ఉపయోగంలోకి తీసుకురాకపోవడంతో ఎమ్మెల్యే, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేకర్ సందర్శించి ఇరిగేషన్ అధికారుల పనితీరుపై మండిపడ్డారు. అనంతరం వారు చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగించేందుకు ఎఫ్‌టిఎస్ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంటర్నేషనల్ కామనె వ్ల్త్ పవర్ లిప్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన వైష్ణవిని అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

## గంజాయి విక్రయిస్తున్న నిందితుల అరెస్టు

**సంజీవ్‌రెడ్డి నగర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త**

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎస్సార్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సార్‌నగర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నేచర్ క్యూర్ హాస్పిటల్ సమీపంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తుల కదలికలను గమనించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. మాధవరావు (20), రాకేష్ (23) అలెక్స్ (25) కేశవరావు (23) మాధవరావు, కేశవరావు ఇద్దరు సొంతం అన్నదమ్ములు. మాధవరావు రాకేష్, అలెక్స్ అనే ముగ్గురు స్నేహితులు. మాధవరావు, రాకేష్‌లు హైదరాబాద్‌లోని స్వాతిక రుచులు హోటల్‌లో సర్వీస్ బాయ్స్‌గా పనిచేస్తున్నారు. మాధవరావు సొంతూరు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన మాధవరావు డియో స్కూటీకొని దానికి నెలవారి ఇన్స్టాల్మెంట్ పే చేయడానికి సులభమైన మార్గాన్ని ఎంచుకున్నారు. రాకేష్, మాధవరావులు స్నేహితులు కావటంతో రాకేష్ మాధవరావు పాడేరు సమీపంలో గంజాయి పండిస్తున్నారు. దానిని తీసుకొస్తే చాలు నేను అమ్మిచ్చే స్తానంటూ రాకేష్ హామి ఇచ్చాడు. రాకేష్ హామీ మేరకు మాధవరావు 6.3కిలోల గంజాయిని తెప్పించి అమీర్‌పేట్‌లోని నేచర్‌క్యూర్ హాస్పిటల్ సమీపంలో అమ్మడానికి చూస్తుండగా, విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సార్ నగర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వారి బృందం అక్కడికి వెళ్లి వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకుని, వారిని అరెస్టు చేశారు. ఈ క్రమంలో అలెక్స్ తప్పించుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్‌నగర్ ఇన్స్‌పెక్టర్లు రాజు రాథోడ్, అఖిల, ఎస్ఆర్ నగర్ సిబ్బంది పాల్గొన్నారు.

## సంస్కృతంలో మహర్షి వాల్మీకి చేసిన రచనలు నేటికీ ప్రామాణికం



బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ఆధ్వర్యంలో మహర్షి వాల్మికి జయంతి నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త:** సంస్కృతంలో మహర్షి వాల్మీకి చేసిన రచనలు నేటికి చిరస్థాయిగా నిలిచి ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ఆధ్వర్యంలో మహర్షి వాల్మికి జయంతి వేడుకలు ఘనంగాజరిగాయి. కళాశాల డైరెక్టర్ విష్ణుప్రియ మాట్లాడుతూ అంతరించిపోతున్న సంస్కృతుల్ని వాల్మికి రచనలలో ఇంకా ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భాష అనేది మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తాయని, ప్రతి ఒక్కరు భాషల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. వాల్మికి మహర్షి పట్టుదలతో అనేకమైన రచనలు చేసి భావితరాలకు అందించారని, వాటిని పరిరక్షించుకోవాలన్నారు. విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరు భాషపై పట్టుసాధించుకోవాలన్నాఉ. సంస్కృతం అధ్యాపకులు ప్రసంగిస్తూ విద్యార్థి దశలో పట్టుదలతో శ్రమించి ముందుకు సాగడం నేర్చుకుంటేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరన్నారు. అందులో వాల్మికి మహర్షిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ప్రాచీనకాలం నుంచి వస్తున్న ఇతిహాసాలు, రామాయణం మొదలుకొని సాహిత్య పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్స్, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## 34 కేసులున్నాయని తప్పుడు ప్రచారం చేయడం తగదు

**-చర్చ్ సొసైటీ అధికారప్రతినిధి రాగి వీరాచారి**

**చిక్కడపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త:** ప్రసిద్ధ క్రైస్తవులకు ఎంతో గొప్ప ఆధ్యాత్మిక కేంద్రమైన హెబ్రోన్ చర్చ్ ట్రస్ట్ సభ్యులు తనపై 34 కేసులున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇవి సత్యదూరమని చర్చ్ సొసైటీ ప్రతినిధి రాగి వీరాచారి స్పష్టం చేశారు. ఇటీవల హైకోర్టులో కేసులపై న్యాయస్థానం స్టే ఇస్తూ తమకు అనుకూలంగా తీర్పును వెల్లడించడం జరిగిందని గురువారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తనపై జరిగిన ఈ తప్పుడుప్రచారం అంశాన్ని హైకోర్టులో న్యాయమూర్తికి దృష్టికితీసుకెళ్లడం జరిగిందని, ట్రస్ట్‌వారు పెట్టినవి నాలుగు కేసులు మాత్రమే ఉన్న పరిశీలించిన కోర్టు కొంత మంది కలిసి హెబ్రోన్ చర్చ్‌పై దాడి చేశారని అన్నారు. ఎలక్ట్రికల్ యంత్రాలతో గేట్లకు తాళాలు కోసి, పగలగొట్టి అక్రమంగా లోనికి ప్రవేశించి దౌర్జన్యం చేశారని ఆరోపించారు. ట్రస్ట్‌కు చెందిన వ్యక్తి ఆ రోజు హెబ్రోన్ చర్చ్ గోడపై నుంచి దూకడంతో చెయి విరిగి గాయం అయిందన్నారు. ఆ గాయాన్ని అదనుగా చూపించి అతనిపై దాడి చేశానని తనపై అక్రమంగా కేసులు పెట్టారని వాపోపాయరు. ప్రభుత్వం, పోలీసులు ఈ విషయాలను గమనించి తమకు తగిన విధంగా న్యాయం చేయాలని కోరారు.

## పౌరాణిక నాటకం లేకుంటే రామాయణ, మహాభారతం కథలు ప్రజలకు అందేవి కావు



రంగస్థల కళాకారులను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త:** తెలుగు సాహిత్య తొలి సోపానం పద్యం అని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అన్నారు. ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పద్యనాటకోత్సవాల్లో భాగంగా చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళావేంకట దీక్షితులు కళావేదికలో 'చింతామణి, భవాని శంకరుల ప్రణయ సన్నివేశం' ప్రదర్శన అద్భుతంగా సాగింది. ఎన్.చంద్రబాబునాయుడు దర్శకత్వంలో రూపొందించిన ఈ నాటక ప్రదర్శనలో చింతామణిగా చాగంటి సాయిలక్ష్మి, భవాని శంకరుడుగా పి.సాయివెంకట్ ప్రదర్శించగా హార్మోనియంపై డాక్టర్ చంద్రబాబునాయుడు, తబలపై కె.వీరబ్రహ్మం వాద్యసహకారాన్ని అందించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ఓలేటి పార్వతీశం హాజరవగా సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ అధ్యక్షత వహించారు. పౌరాణిక నాటకం లేకుంటే రామాయణ, మహాభారతం కథలు ప్రజలకు అందేవి కావన్నారు. కార్యక్రమంలో యువకళావాహిని అధినేత లంక లక్ష్మినారాయణ, హెలెన్ కెల్లర్ సంస్థ అధినేత ఉమర్ ఖాన్, జనహిత చీఫ్ సేల్స్ మేనేజర్ వి.ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రంగస్థల కళాకారులు పి.సాయివెంకట్, చాగంటి సాయిలక్ష్మి, సత్యనారాయణ, డాక్టర్ చంద్రబాబునాయుడు, వర్ధమాన సినీనటి పూజిత, నస్రీన్‌లను సత్కరించారు.

## మెట్టుగూడలో గుర్తు తెలియని మృతదేహం...

**సికింద్రాబాద్, అక్టోబర్ 17 ప్రభాతవార్త:**

నలభై అయిదు సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చిలకలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మెట్టుగూడ ఆలుగడ్డబావి సమీపంలో రోడ్డుపక్కన పడిఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికుల సమాచారం మేరకు స్వాధీనం చేసుకున్నారు. మృతుడి ఒంటిపై పర్పుల్ కలర్ షర్ట్, ఆష్ కలర్ ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. సంబంధికులు ఎవరైనా ఉంటే చిలకలగూడ పోలీసులను సంప్రదించాలని కోరారు

## ఆధ్యాత్మిక వాతావరణంలో ఇంద్ర యజ్ఞం గ్రంథం ఆవిష్కరణ



**అత్తాపూర్ అక్టోబరు17,ప్రభాతవార్త :** అత్తాపూర్ పరిధిలోని చిన్న అనంతగిరి శివాలయంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.కుల వర్ణ ప్రాంత వివక్ష లేకుండా ప్రజలంతా ఇంటి దగ్గర సరళమైన రీతిలో యజ్ఞం చేసుకునే విధానాన్ని తెలియజేస్తూ రూపొందించిన ఇంద్ర యజ్ఞం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.అరుణాచలం పుణ్యక్షేత్రంలో భగవాన్ రమణ మహర్షి ,కావ్య కంఠ గణపతి ముని ఆశీస్సులతో వేదములలో వివరించిన మంత్రముల ఆధారంగా ఈ పుస్తకం రూపొందించబడమైనది.ఈ పుస్తకంలో సరళంగా యజ్ఞం చేసుకునే విధానాలను మంత్ర భావములతో సహా శ్రీ గణపతి ముని గారు ప్రసాదించిన ఇంద్ర యజ్ఞంను వివరించినట్లు గ్రంథకర్త శ్రీ సూర్య ఫణిమాధవ్ వెల్లడించారు.ఈ కార్యక్రమానికి అతిథులుగా అడిషనల్ డిసిపి శ్రీనివాసరావు,చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ విద్యాసాగర్ రెడ్డి ,విశిష్ట అతిథులుగా రాష్ట్రీయ సేవికా సమితి నుంచి గౌద రమాదేవి,రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నుంచి రమా విశ్వనాథన్ విచ్చేశారు.ఈ కార్యక్రమాన్ని గాయత్రి తపోవనం ఆశ్రమ శిష్యులు అందరూ కలిసి మూలకర్తలుగా నిలిచి నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలందరితో కుల ప్రాంత వర్ణ, లింగ వివక్షణ లేకుండా సామూహికంగా ఇంద్ర యజ్ఞం చేయించారు.ఇదే మాదిరిగా సరళమైన రీతిలో ప్రతి ఇంట్లోనూ ఇంద్ర యజ్ఞం జరగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ వార్డు సభ్యుడు గుండాల వేణుగోపాల్

## విద్యాభివృద్ధికి చేయూత అందిస్తా : వేణుగోపాల్

**నందిగామ,అక్టోబరు 17 ప్రభాతవార్త** విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేసి ఉన్నతులుగా తీర్చిదిద్ది సమాజ వికాసానికి కృషి చేయాలని నందిగామ వెంకమ్మగూడ గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యుడు గుండాల వేణుగోపాల్ ఉపాధ్యాయులకు విన్నవించారు. గురువారం వెంకమ్మగూడ పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. విద్యార్థుల చదువుల ప్రోత్సాహంలో భాగంగా రాకపోకలకు 6000 వేల ఆర్థిక సాయం అందజేస్తున్న గుండాల వేణుగోపాల్‌కు ఉపాధ్యాయులు తెలిపారు.

## దివ్యజ్యోతి పాదయాత్ర శుభప్రదం కావాలి



అయ్యప్ప స్వామి దేవాలయానికి రంగులు వేయిస్తామని చెక్కు అందజేస్తున్న కేశవులు

**నందిగామ,అక్టోబరు 17 ప్రభాతవార్త** అయ్యప్ప దేవాలయ పునర్నిర్మాణంలో భాగంగా గుడికి అన్ని అంగులతో సరిపోను రంగులు వేయడానికి ముందుకొచ్చిన బీఆర్ఎస్ లింగంపల్లికి చెందిన బెజగం కేశవులును గురుస్వామి గిరీష్‌గౌడ్ ఆధ్వర్యంలో సన్మానించారు. నానక్‌రాంగూడ నుంచి శబరిమలైకు దివ్య జ్యోతి పాదయాత్రకు వెళ్లిన స్వాములను ఆశీర్వదించి పంపారు. పాదయాత్రతో గురుస్వాములు ముత్యం రెడ్డి కృష్ణారెడ్డి నరసింహగౌడ్ శంకర్ సింగ్‌నాగూర్ కిషోర్ జంగారెడ్డి పద్మావతి పాపయ్యయాదవ్ స్థానిక నాయకులు లక్ష్మయ్య యాదవ్ జిల్లెల బాల్‌రెడ్డి శ్రీకాంత్ గౌడ్ తుమ్మల నరసింహులు గద్దల యాదగిరి నిరంజన్ వెంకట్‌రెడ్డి పెద్దలు ఉన్నారు.

## సకల శుభాలు కలగాలి

### నందిగామలో అంబరాన్నంటిన బోనాల సంబరాలు



నందిగామలో అంబేద్కర్ కాలని వాసుల బోనాల వేడుకల దృశ్యం

**నందిగామ,అక్టోబరు 17 ప్రభాతవార్త** నందిగామలో బోనాల వేడుకలు అంబరాన్ని అంటాయి. సకల దేవతల ఆశీస్సులతో సర్వ కార్యములలో విజయం సిద్ధించాలని అందిరినీ చల్లగా చూడాలని అమ్మోరు తల్లికి బోనం సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. ఈవేడుకల్లో అంబేద్కర్ కాలనీ వాసులు గ్రామపెద్దలు ఆయా యువజన సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్ విదేశీ విద్య ఉపకార వేతనాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

**వికారాబాద్ రూరల్,అక్టోబరు 17 ప్రభాతవార్త** తెలంగాణ ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యపథకం క్రింద జిల్లాలో అర్హులైన మరియు బిటెక్ పూర్తి చేసిన ఎస్సీ అభ్యర్థుల మాస్టర్స్ చదువుట కొరకు ప్రభుత్వం సూచించిన దేశాలలో యూఎస్ఏ యూకే ఆస్ట్రేలియా కెనడా సింగపూర్ జర్మని న్యూజిలాండ్ జపాన్ ప్రాన్స్ సౌత్ కోరియా దేశాలలో విదేశీ విద్యనభ్యసించాలనుకునే ఆసక్తిగల అర్హులైన వారికి ఉపకారవేతనము రూ.20.00లక్షలు మంజూరు చేయడం జరుగు తుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి యన్ మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తేదీ 29-10-2024వరకు గడువు పొడిగించడం జరిగిందని అన్నారు. అభ్యర్థులు ఈ పాస్ నందు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## జిల్లాలో 470పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు

### మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

**రామాయంపేట, అక్టోబరు 17, ప్రభాతవార్త :** రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో బుధవారం మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పర్యటించారు. ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 470కి పైగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని అన్నారు. రైతులు పండించిన సన్నధాన్యంకు దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 500 బోనస్ ప్రకటించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌదరి సుప్రభాత్‌రావు, రమేష్‌రెడ్డి, కుమార్‌సాగర్, ఎనిశెట్టి అశోక్ గుప్తా, శివప్రసాద్‌రావు, పాల్గొన్నారు.

**ఎల్ఓసీ అందజేత...**

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని గొలిపర్తి గ్రామానికి చెందిన ఎర్రం రాములు తండ్రి మల్లయ్య ఆరోగ్య చికిత్స కొరకు నియోజకవర్గ ఎమ్మెల్యే రోహిత్‌రావు 1,90,000 ఎల్ఓసిని అందజేయడం జరిగింది.

## విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా కళాశాలల బంద్ విరమణ

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబరు 17, ప్రభాతవార్త :** విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా కళాశాలల బంద్‌ను విరమిస్తూ, రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు నేటినుండి(శుక్రవారం) కళాశాలల యధావిధిగా నడపాలని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి లయన్ వలిశెట్టి సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదలచేస్తూ రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజెస్ యాజమాన్యాల సంఘం టైగర్ ఆర్. కృష్ణయ్య సమక్షములో జరిపిన చర్చలు సఫలీకృతం అయ్యాయని పేర్కొ న్నారు. పెండింగులో ఉన్న టోకెన్స్ రేపు రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి, రెండు మూడు రోజుల్లో విడుదల చేస్తామని హామి ఇచ్చారన్నారు. అలాగే మిగిలిన పెండింగులో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా వాయిదాల వారిగా విడుదల చేస్తామని ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం ప్రభుత్వం తరపున హామి ఇచ్చారని తెలిపారు. కావున విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా, గ్రూప్ 1, మరియు గ్రూప్ 2 పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ఇట్టి కళాశాలల బందును విరమిస్తూ, రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు శుక్రవారం నుండి యాదావిధిగా కళాశాలలు నడపాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**బీఆర్‌డీఎస్ డిజైన్ ఎగ్జిబిషన్**

నగరం వేదికగా దేశంలోనే అతిపెద్ద డిజైన్ ఎగ్జిబిషన్ బిఆర్‌డిఎస్ డిజైన్ ఎగ్జిబిషన్‌లో ప్రముఖ ఆర్టిస్టులు తమ నైపుణ్యాలతో ఆకట్టుకున్నారు. భన్వర్ రాథోడ్ డిజైన్ స్టూడియో (బిఆర్‌డిఎస్) ఆధ్వర్యంలో నగరంలోని ది ప్లాటినం బిజినెస్ హోటల్ వేదికగా నిర్వహించిన డిజైన్ ఎడ్యుకేషన్ అవేర్‌నెస్ సెషన్‌లో భాగంగా ఫ్యాషన్ టెక్స్ టైల్ ఇంటీరియల్ ఆర్కిటెక్చర్ ప్రొడక్ట్ ఆటోమొబైల్ గ్రాఫిక్ యూనిమేషన్ ఫొటో గ్రఫీ బహుళ విభాగాలపై అవగాహన కల్పించారు.



## ఆదికవి వాల్మీకి మహర్షి కారణజన్ముడు

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**తలకొండపల్లి,అక్టోబరు 17 ప్రభాతవార్త** రామాయణాని ్న జనరంజకంగా రచించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి దేవాలయంలో నిర్వహించిన జయంతి వేడుకలకు ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి విచ్చేసి వాల్మీకి విగ్రహానికి కొబ్బరికాయకొట్టి పూలమాలలువేసి ఘనంగా జయంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకి జీవితం ఎతో విలక్షణమైనదని వాల్మీకి తన జీవిత కాలంలో పాపపుణ్య కర్మలను ప్రక్షాళన చేశాడు. వాల్మీకి జీవితంలో అతడు ఎదిగినటువంటి ఘట్టాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

## ఎమ్మెల్యేకు ఘనస్వాగతం



**తలకొండపల్లి,అక్టోబరు 17 ప్రభాతవార్త** తలకొండపల్లి మండల పరిదిలోని గట్టుఇప్పలపల్లి గ్రామంలో గురువారం వాల్మీకి జయంతి ఉత్సవాలకు హాజరైన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు రేణురెడ్డి డేవిడ్ ప్రశాంత్ రెడ్డిల ఆద్వర్యంలో ఘనస్వాగతం పలికారు. నూతనంగా రైన్‌రెడ్డి కృష్ణయ్య



ఏర్పాటుచేసిన బాలాజీ రియల్‌ఎస్టేట్ కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామ కార్యకర్తలతో ముచ్చటించిన ఎమ్మెల్యే గట్టుఇప్పలపల్లి గ్రామానికి బ్యాంకు ఏర్పాటు చేయాలని అందరూ కోరడంతో మీగ్రామానికి బ్యాంకు ఏర్పాటుకు కృషి చేస్తానని రెండు మూడు నెలలో బ్యాంకు మంజూరు చేయిస్తానని ఆయన తెలిపారు. అంతకు ముందు నాగర్‌కర్నూల్ జిల్లా మాజీ వైస్ చైర్మన్ బాలాజిసింగ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు రేన్‌రెడ్డి డేవిడ్ ప్రశాంత్‌రెడ్డి రఘుపతిరెడ్డి మాజీ ప్రజాప్రతినిధులు రఘురాములు జోరు రమేష్ రమేష్ యాదవ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి ఏదుల మచ్చేందర్ రాజశేఖర్ వాల్మీకి సంఘం నాయకులు కిషన్‌శేఖర్ పవన్ రమేష్ వెంకటయ్య బాలయ్య మహిళా నాయకులు పద్మమ్మ అంజమ్మ చిట్టెమ్మ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి జయంతి వేడుకల్లో రాష్ట్రఫుడ్ కమిషన్ చైర్మన్ గోలిశ్రీనివాస్‌రెడ్డి

### బిఆర్‌ఎస్‌పార్టీ సీనియర్ నాయకుడు సిఎల్ శ్రీనివాస్‌యాదవ్



**తలకొండపల్లి,అక్టోబరు 17 ప్రభాతవార్త** కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం గట్టిఇప్పలపల్లి గ్రామంలో ఆదికవి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాష్ట్రఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ ఎంపిపి సిఎల్ శ్రీనివాస్‌యాదవ్ హాజరై వాల్మీకి మహర్షి కి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం రేణురెడ్డి మండల కృష్ణయ్య నూతనంగా ఏర్పాటుచేసిన భవాని రియల్ ఎస్టేట్స్ కార్యాలయాన్ని సందర్శించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి మాజీ వైస్ ఎంపిపి శ్రీనివాస్‌రెడ్డి మాజీ ఉపసర్పంచ్ స్వామి గ్రామ బిఆర్ఎస్ అద్యక్షుడు ఎదుల రాజు నాయకులు మండల కృష్ణయ్య రేణురెడ్డి గుజ్జుల మహేష్ రాజేందర్ జంగయ్య అశోక్ శ్రీను మచ్చేందర్ అనంత రాములు రమేష్ అంజయ్య రాజు రమేష్ శేఖర్ జీవ తదితరులుపాల్గొన్నారు.

## సిఐని కలిసిన కాంగ్రెస్ మహిళా నాయకులు



**కేశంపేట,అక్టోబరు 17 ప్రభాతవార్త** ఇటీవల మండలానికి కొత్తగా వచ్చిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరహరి బాధ్యతలు స్వీకరించారు. గురువారం మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేశంపేట మండల మహిళా మండల అధ్యక్షురాలు జూలపల్లి అనుసూయమ్మ ముదిరాజ్ ఆధ్వర్యంలో కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో మండల కమిటీ సభ్యులతో కలిసి శాలువాతో సన్మానించి పూల బొకేను అందించారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా కాంగ్రెస్ కమిటీ సభ్యులు అస్మాబేగం సుజాత లలిత లక్ష్మి అరుణ లలిత నర్సమ్మ మణెమ్మ రజియా ఉన్నారు.

## బిజెపి సభ్యత్వానికి మంచి స్పందన

### వాల్దాస్ మల్లేష్‌గౌడ్

**నర్సాపూర్ అక్టోబరు 17, ప్రభాతవార్త:** మండలంలో బిజెపి సభ్యత్వానికి మంచి స్పందన లబిస్తుందని ఆపార్టీ నాయకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ అన్నారు. గురువారం నర్సాపూర్ మండల పరిధిలోని అచ్చంపేట, తిరుమలపూర్ తదితర గ్రామాల్లో బిజెవైఎం నాయకులు వాల్దాస్ అరవింద్‌గౌడ్ అధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి బిజెపి నాయకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని సభ్యత్వ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ మండల పరిధిలోని గ్రామాల్లో బిజెపి పార్టీ సభ్యత్వానికి అపూర్వ స్పందన లబిస్తుం దన్నారు. ఈమేరకు బిజెపి నాయకులు గ్రామాల్లో పర్యటిస్తు కేంద్రంలోని బిజెపి ప్రభత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తు సభ్యత్వాన్ని సేకరిస్తున్నారని తెలిపారు.ఈ మేరకు గ్రామాల్లో బిజెపి సభ్యత్వ కార్యక్రమం జోరుగా సాగుతుందని రాబోయే కాలంలో నర్సాపూర్ మండలం లో బిజెపి పార్టీ మరింతగా భలోపేతం అవుతుందన్నా ఆశాభావం వాల్దాస్ మల్లేష్‌గౌడ్ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరవింద్‌గౌడ్, అచ్చంపేట లో పులుకంటి మల్లేషం, చంద్రయ్య, బాగులు, గూడూరి మల్లేష పాల్గొన్నారు.

## విధులను మరిచిన మండల అధికారులు

**111జీవోకు విరుద్ధంగా 20 ఎకరాల వెంచర్**

**వెంచర్‌కు ప్రభుత్వ భూమినుండి దారులు**

**మొయినాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** మండలంలోని ప్రభుత్వ అధికారులు విధులను మరిచి అసలు రెవన్యూ, పంచాయితీ అధికారులు ఉన్నారా ఉంటే మండలంలోని కనకమామిడి గ్రామ రెవెన్యూలో సర్వే నెంబర్ 267,269 పర్యావరణానికి తూట్లు పోడుస్తు 111 జీవోను తుంగలో తొక్కి అక్రమంగా 20 ఎకరాల వెంచర్ వేయడంపై స్థానికులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు, 267, 269 సర్వేనెంబర్ భూమిలోకి వెంచర్‌కు దారి లేకపోవడంతో పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెం, 510 నుండి దాదాపు రెండు ఎకరాల మేర 40 నుండి యాభై ఫీట్ల వేడల్పుగా వెంచర్‌కు రెండు వైపుల ప్రభుత్వ భూమి నుండి ఎలాంటి అనుమతులు లేని అక్రమ వెంచర్‌కు దారులు నిర్మించారు. ఇదే సర్వేనెంబర్ పక్కన ఉన్న భూమిలోకి 510 సర్వేనెంబర్ నుండి దారులు వేస్తే రెవెన్యూ అధికారులు గతంలో దారులు తోలగించి ప్రభుత్వ బోర్డును ఏర్పాటుచేసారు, పక్కన ఉన్న ఇతరుల రోడ్లను నిర్మాణాలను కూల్చీ వేసి, ఇటు పక్కన ఉన్న సర్వేనెంబర్‌లలో వెంచర్‌లు జరుగుతుంటే కూల్చీ వేతలు కాదు కదా కనీసం ఇపిన పాపాన పోకపోవడంలో ఏం ఆంతర్యం దాగుందని చుట్టు పక్కల ఉన్న రైతులు అంటున్నారు, మండలంలో 111జీవో ఉందని, దానికి కోసం జిల్లా స్థాయిలో డిపివో, నియోజకవర్గం స్థాయిలో డిఎల్‌పీవో, మండల స్థాయిలో ఎంపీవో లపేర్లతో అధికారులు ఉన్నారని 111 జీవోను రక్షించాల్సిని అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సర్వేనెం 267,269 లో ఒక నాడు



కనకమామిడి రెవెన్యూ సర్వేనెం 510లో నుండి వెంచర్‌కు వేసిన దారి

సీలింగ్, అసైండ్ భూములు ఉండేవని మరి అవి ఏ విధంగా రూపాంతరం మారాయే, ఆ సంబధిత అధికారులకే తెలియాలన్నారు, రెవన్యూ అధికారులు ఇంచుమించు రెండు ఎకరాల పైన ప్రభుత్వ భూమని అక్రమించి రంగులు అద్ది రోడ్లు వేస్తుంటే రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి, ఇప్పటికైనా సంబంధిత మండల స్థాయి కాకుండా పై అధికారులైనా చోరవ తీసుకోని చట్టపరమైన చర్యలు తీసుకోని, ఆటు 510లో ఉన్న ప్రభుత్వ భూమని, రెవెన్యూ అధికారులు, ఇటు 111 జీవోకు విరుద్ధంగా వెలిసిన అక్రమ వెంచర్ పై పంచాయితీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు,

**మొయినాబాద్ తహసిల్దార్ గౌతమ్‌కుమార్ వివరణ**

కనకమామిడి గ్రామ రెవెన్యూలో సర్వేనెం 510లో ప్రభుత్వ భూమి ఉంది, అక్కడ నుండి వెంచర్‌కు దారులు వేసిన విషయం మా దృష్టికి రాలేదని ఏవరైనా ప్రభుత్వ భూమి జోలికొస్తే విచారణచేస్తామని అలాంటి కబ్జాలు, దారులు ఏమైనా ఉంటే అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు,

## హైకోర్టు జడ్జి పర్యటన.. ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో

**పాపన్నపేట, అక్టోబరు 17, ప్రభాతవార్త:** ఏడుపాయల వనదుర్గా భవాని మాతను దర్శించుకునేందుకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి శనివారం హాజరవుతున్నదృష్ట్యా చేపడుతున్న ఏర్పాట్లను గురువారం ఆర్‌డిఓ రమాదేవి గురువారం పరిశీలించారు. న్యాయమూర్తి వచ్చి అమ్మవారిని దర్శించుకుని వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లపై ఆర్‌డిఓ పోలీసు, రెవెన్యూ, ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్‌డిఓ వెంట డిఎస్‌పి ప్రసన్నకుమార్, ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐ నాగరాజు ఉన్నారు.

## ఏడుపాయల్లో ఘనంగా పల్లకి సేవ

**పాపన్నపేట, అక్టోబరు 17, ప్రభాతవార్త:** ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయ సన్నిధిలో పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని పల్లకి సేవను నిర్వహించారు.అందంగా అలంకరించిన పల్లకిలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్టించుకుని భజనలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులతోపాటు ఈఓ చంద్రశేఖర్, సిబ్బంది సూర్యశ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మినారాయణ, ప్రతాప్‌రెడ్డి, రవికుమార్, మహేష్, నరేష్, యాదగిరి, ఆయా ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు

**పాపన్నపేట, అక్టోబరు 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో 300 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా 12 మందికి లోపం ఉందని వైద్యులు శ్యామ్‌రావు తెలిపారు. అవసరమైన వారికి కంటి అద్దాలు అందచేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, ఉపాధ్యాయులు వెంకటేశం, ప్రవీణ్, వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణకాంత్, మంగ నర్సింలు, యాదయ్య, పద్మ, రజిత పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

**సిర్గాపూర్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గర్దేగాం గ్రామంలో ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో బుధవారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని ముదిరాజ్ భవన్‌లో సాంప్రదాయ జాగరణ భజనలు చేపట్టారు. అంతకుముందు గ్రామ స్థులు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. జయంతి వేడుకలు బాబురావుమహారాజ్, యాదవరావుల ఆధ్వర్యంలో భజనలు చేపడుతున్నారు.

**మండల పరిషత్ కార్యాలయంలో...**

మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో శ్రీ వాల్మీకి జయంతి వేడుకలను అధికారులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాల్మీకి చిత్రపటానికి అధికారులు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మల్సూర్ నాయక్, ఎంపిఓ బ్రహ్మంచారి, ఎపిఓ బస్వరాజ్, నాయకులు శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

**కొల్చారం తహసీల్దార్ కార్యాలయంలో...**

**కొల్చారం, అక్టోబరు 17 ప్రభాతవార్త:** వాల్మీకి మహర్షి సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కొల్చారం తహసీల్దార్ గఫార్ మియా అన్నారు. గురువారం కొల్చారం తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి తహశీల్దార్ గఫార్‌మియాతో పాటు సిబ్బంది, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గఫార్ మియా మాట్లాడుతూ వాల్మీకి మహర్షి సేవలు అద్భుతం అని, ఆయన సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్, సిబ్బంది నీరుడి శేఖులు, సాయిలు, అమరేశ్వరి, కాంగ్రెస్ పార్టీ నేత పోతిరెడ్డిపల్లి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి కృపతో అందరూ సంతోషంగా ఉండాలి

### మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహగౌడ్

**అమీన్‌పూర్, అక్టోబరు 17 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి లో నూతన దేవాలయాలకు సంపూర్ణ సహకారం అందిస్తానని మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహగౌడ్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని భ్రమరాంబిక కాలనీలో శ్రీకనకదుర్గ మాత ఆలయ విగ్రహ ప్రతిష్టాపన కార్య క్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలకు సంపూర్ణ సహకారం అందిస్తానని, అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వైస్ చైర్మన్ నరసింహగౌడ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నందారం రమేష్ గౌడ్, బోయిని బాలరాజు, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఇంద్రేశం జ్ఞానేశ్వర్, లింగం గౌడ్, భాస్కర్ రెడ్డి, సుధాకర్, దండు జ్ఞానేశ్వర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను సన్మానించిన పిఆర్‌టియు

**నాగల్‌గిద్ద, అక్టోబరు 17, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన చేసేందుకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను గురువారం మండల కేంద్రమైన నాగల్‌గిద్దలో పిఆర్‌టియు నాయకులు ఘనంగా సన్మానించారు. డిఎస్‌సి 2024లో ఎంపికైన ఉపాధ్యాయులను పిఆర్‌టియు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పిఆర్‌టియు మండల అధ్యక్షులు ఎస్ రమేష్, ప్రధాన కార్యదర్శి నాగ్నాథ్‌లు మండలానికి చేరుకున్న 29 మంది ఉపాధ్యాయులను పూలమాలలతో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గణపతి, నాయకులు విజయేందర్‌రెడ్డి, శివరావు, బసవరాజ్, బాపుశెట్టి, సూర్యకాంత్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎకరానికి రూ. 2 కోట్ల నష్టపరిహారం చెల్లించాలి

**నర్సాపూర్ అక్టోబరు 17, ప్రభాతవార్త:** రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న భూనిర్వాసిత రైతులకు మార్కెట్ విలువ ప్రకారం ఎకరానికి రూ. 2 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని, లేదా భూమికి బదులు భూమి ఇవ్వాలని నర్సాపూర్ మండలపరిధిలోని రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామాల భూనిర్వాసిత రైతులు నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల్లో ట్రిబుల్ ఆర్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతుల భూముల విలువ బయట మార్కెట్ ధర 3 కోట్లు పలుకుతున్నందున ఇందుకు తగ్గట్లుగా కనీసం రెండుకోట్ల వరకైనా నష్ట పరిహారం చెల్లించాలని లేనిపక్షంలో మేము కోల్పోతున్న భూములకు బదులుగా భూముల ఇవ్వాలని వారు కోరారు. ఈ విషయమై భూనిర్వాసిత రైతుల యొక్క వినతిని రాష్ట్ర ముఖ్యమంనరతి దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని ట్రిబుల్ ఆర్ రోడ్డులో భూములు కోల్పోతున్న భూనిర్వాసితా రైతులు కోరారు. ఈవిషయమై ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ డవిజన్ పరిధిలో గల 16 గ్రామాల్లో ట్రిబుల్ ఆర్ రోడ్డుకు సంబంధించిన అవార్డు ప్రక్రియ పూర్తి కావచ్చిందని తెలిపారు. ఈ విషయంలో రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామస్తులు తమకు సహకరించాలన్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి భూనిర్వాసిత రైతులుకు న్యాయం చేయడానికి కృషి చేస్తానని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి సహకరించాలి

### -బిహెచ్ఇఎల్ ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే

**రామచంద్రాపురం, అక్టోబరు 17, ప్రభాతవార్త:** తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి బీహెచ్ఈఎల్ ఉన్నతాధికారులు సహకరించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి వినతి పత్రం అందచేశారు. గురువారం బీహెచ్ఈఎల్ ఈడి బరణి రాజుతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమావేశం అయ్యారు. సమస్యల పరిష్కారంలో బీహెచ్ ఈఎల్ ఎస్టేట్ అధికారులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారని ఎమ్మెల్యే ఈడి దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ పరిధిలోని ఎంఐజి 2 పరిధిలో అంతర్గత మురుగునీటికాలువ నిర్మాణ పనులకు, ఎంఐజి 2 ముఖ ద్వారం నుంచి అన్నమయ్య కాలనీ మీదుగా బిమ్యక్ వరకుగల రహదారిని మూసివేశారని వెంటన రోడ్డును తెరిపించాలన్నారు. అంతర్గత రహదారుల మరమ్మతు పనులకు అనుమతించాలన్నారు. ఎస్టేట్ అధికారుల అభ్యంతరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. సమస్యలను సానుకూలంగా విన్న ఈడి త్వరలోనే సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామి చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. సమావేశంలో తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్లు, నాయకులు మల్లేపల్లి సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై అధికారులతో కార్పొరేటర్ సమీక్ష

**రామచంద్రాపురం, అక్టోబరు 17, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివి జన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై, కొనసాగాల్సిన పనులపై గురువారం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ అధికారులతో శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ వార్డు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్‌నగర్ కాలనీ బస్సురూట్‌లో సీసీ రోడ్డు, కాకతీయ నగర్‌లో సిసి రోడ్డు నిధుల మంజూరుకు, బాలవిహార్ పార్కు పనులకు, జ్యోతినగర్‌లో బాక్స్ డ్రైన్ పనులు త్వరగా పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. మయూరినగర్‌లో 61.50 లక్షల రూపాయలతో సిసిరోడ్డు పనులను వారం రోజుల్లో ప్రారంభించాలన్నారు. సిద్దిపేటలోని కోమటి చెరువులా సిఎం మంత్రులు, ఎమ్మెల్యేల సహకారం తో రాయసముద్రం చెరువు అభివృద్ధి చేయిస్తామని మత్స్యకారులకు హామి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సురేష్, ఇరిగేషన్ డీఈ నళిని, ఏఈ పావని, ఇంజనీరింగ్ శాఖ డీఈ నరేందర్ ఏఈ ప్రభు, నాయకులు ఎల్లర్తి మల్లేశం, చిగురు శ్రీను, గాంధీ శ్రీను, ఈర్ల బాలరాజు, ఈర్ల జైపాల్, ఈర్ల శ్రీను, బైకన నవీన్, నవీన్ యాదవ్, ఈర్ల మహేష్ ఖాజా పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టాపన పూజలో చైర్మన్ గిరిధర్‌రెడ్డి

**జహీరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** మండలపరిధిలోని చిరాగ్‌పల్లి లో గురువారం శ్రీతుల్జా భవాని మాత దేవాలయంలో శ్రీపరశురాముని విగ్రహాన్ని వేద బ్రాహ్మణులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రతిష్టాపన కార్యక్రమాలు ఘనంగా ముగిసాయి. ప్రతిష్టాపన పూజలకు రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిధర్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ నాయకులను ఆలయ కమిటి సభ్యులు ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, యువజన సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ భవన్‌కు తరలివెళ్లిన బిఆర్‌ఎస్‌వి నాయకులు

**జహీరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన బిఆర్‌ఎస్ పార్టీ విద్యార్థి యువజన విభాగం నాయకుల సమావేశానికి జహీరాబాద్ నియోజకవర్గం నుంచి బిఆర్‌ఎస్‌వి నాయకులు, ఉద్యమకారులు జె.రవికిరణ్, రాకేష్, ఓంకార్, ఫయాజ్, మధు తరలివెళ్లారు. సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కెటిఆర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని, పార్టీ బలోపేతానికి దిశ నిర్దేశం చేయనున్నారని నాయకులు వివరించారు.

## మండలానికి 24 మంది కొత్త ఉపాధ్యాయులు : ఎంఇవో

**సిర్గాపూర్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన చేసేందుకు కొత్తగా 24 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు ఎంఈఓ నాగారం శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని ఎంఆర్‌సి కార్యాలయంలో కొత్త ఉపాధ్యాయులు నియామక పత్రాలను సబందిత పరిశీలన అధికారిణి మంజులాదేవి, మహేందర్, సిఆర్‌పి శివకుమార్‌లు బుధవారం పరిశీలిం చారు. కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు నియమించారు.

## ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలి

**నర్సాపూర్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** ఫీజు రియంబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలంటూ నర్సాపూర్‌లో ప్రైవేటు డిగ్రీ, పిజీ కళశాలల యాజయాన్యం అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు నర్సాపూర్‌లో భారీ ర్యాలీ నిర్వాహించారు. ఈ సందర్భంగా కళాశాలల యాజమాన్యం అసోసియేషన్ ప్రతినిధులు ర్యాలీతో వెళ్లి ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అన్ని ప్రైవేటు కళాశాలలో పేద, మధ్యతరగతి విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో యాజమాన్యాలు అధ్యాపకుల జీతాలు, భవనాల అద్దెలు, కరెంటు బిల్లులు యూనివర్సిటీ రుసుములు, బిల్డింగ్ టాక్స్‌లు చెల్లించడానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ప్రభుత్వం దసరా పండగ వరకు ఈఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లిస్తామని చెప్పి ఇప్పటివరకు చెల్లించ లేదన్నారు. యాజమాన్యాలు ఈ ఖర్చుల నిమిత్తం అప్పులు తెచ్చి వడ్డీలు కట్టలేని పరిస్థితులు చోటు చేసుకున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రియమెంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేటు డిగ్రీ పిజీ కళశాలల యాజయాన్యం అసోసియేషన్ ఈసీ మెంబర్ ఎన్ అశోక్‌కుమార్, అధ్యాపకులు సందీప్‌కుమార్, దస్తగిరి, రుషేందర్‌రెడ్డి, కృష్ణ, భూమేశ్, రాజు, హరికృష్ణ, కావ్య, అనూష, దివ్య, నవిత, ఎల్లంకీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## రెవెన్యూ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్‌డిఓ

**అల్లాదుర్గం, అక్టోబరు 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని తహ సీల్దార్ కార్యాలయాన్ని మెదక్ ఆర్‌డిఓ రమాదేవి గురువారం తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను, గ్రాడ్యూయేట్ ఎంఎల్‌సి ఓట్ల ధరఖాస్తులను ఆర్‌డిఓ పరిశీలించారు. ధరణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత వ్యవధిలో భూసేకరణ మధ్య వర్తిత్వ కేసుల తనిఖీ జాబితాలను పరిశీలించారు. ఈ మీ సేవ సర్టిఫికెట్లు నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. వరి కొనుగోలు కేంద్రాలపై ఆరా తీశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే వరిని కొనుగోలు చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తే నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అల్లాదుర్గంకు మంజూరైన కోర్టు భవనాన్ని సందర్శించి కార్యాలయ సిబ్బందితో సమావేశం అయి పలు సూచనలు చేశారు. 19న జరిగే కోర్టు ప్రారంభోత్సవానికి తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## మున్సిపల్ 7 వ వార్డులో చిల్డ్రన్ పార్కు భూమిపూజ



చిల్డ్రన్ పార్కు అభివృద్ధికై భూమిపూజ చేసిన చైర్మన్ బి. కొండల్ రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 17, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ 7 వ వార్డులో దాదాపు ఆరు లక్షల రూపాయల నిధులతో చిల్డ్రన్ పార్కు అభివృద్ధికి చైర్మన్ బి. కొండల్‌రెడ్డి గురువారం కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్ తదితర సదుపాయాల కల్పించనున్నట్లు తెలిపారు. చైర్మన్ తోపాటువైస్ ఛైర్మన్‌రెడ్యా నాయక్, కౌన్సిలర్‌ఆకిటి శైలజారెడ్డి, స్థానికనాయకులు ఆకిటి బాల్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు**

పోచారంమున్సిపల్ కార్యాలయం వద్ద వాల్మీకి జయంతి సందర్భంగా చిత్రపటానికి చైర్మన్ కొండల్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు బి.హరిప్రసాద్‌రావు, బాలగోని వెంకటేశ్ గౌడ్, నాయకులు ఆకిటి బాల్‌రెడ్డి, మేనేజర్ అంజన్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

## ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ, అక్టోబరు 17,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని లాల్‌పహాడ్‌లో గురువారం వాల్మీకి జయంతిని ఘనంగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా లాల్‌పహాడ్ ముఖ్యకూడలీలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బోయ కుర్మయ్య, నర్సింహులు, యాదయ్య, చంద్రయ్య, సురేష్, మల్లేష్, చెన్నయ్య, జంగయ్య, బాబు పాల్గొన్నారు.

## నారపల్లిలో పొల్యూషన్ బోర్డు అధికారుల పర్యటన



నీటి శాంపుల్ సేకరించిన పొల్యూషన్ బోర్డు అధికారులు

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 17, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ పరిధిలోని నారపల్లిలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు గురువారం పర్యటించారు. మున్సిపల్ పరిధిలోని నారపల్లి పెద్ద చెరువును పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సందర్శించి వాటర్ శాంపిల్‌ను సేకరించారు. పెద్ద చెరువులోకి చెంగిచెర్ల జంతువధశాల నుండి వెలువడే కాలుష్యకారకాల వల్ల చెరువులోని నీరు కాలుష్యమయి ప్రజలు అనారోగ్యానికి గురైతున్నారని పొల్యూషన్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చైర్మన్ కొండల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు కమిషనర్ వీరారెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు మహేశ్, కో అప్షన్ సభ్యుడు అక్రం అలీ, నాయకులు సుర్వీ శ్రీనివాస్ గౌడ్, అబ్బవతి నర్సింహ, మోటుపల్లి శ్రీనివాస్, ఆకిటి బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

### సిపిఎం కార్యవర్గసభ్యులు బుస్స చంద్రయ్య



మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

**బొంరాస్‌పేట్/దుద్యాల్, అక్టోబరు17, ప్రభాతవార్త :** ఈనెల 19,20వ తేదిన తాండూర్‌లో నిర్వహించే సిపిఎం జిల్లా మహాసభలను విజయ వంతం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులు బుస్స చంద్రయ్య అన్నారు. ఈ సందర్భంగా దుద్యాల్ మండల కేంద్రంలో సిపిఎం మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 19,20వ తేదిలలో తాండూర్‌లో సిపిఎంజిల్లా మహాసభలు నిర్వ హించడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా పేదలు,కార్మికులపైన నిత్యవసర వస్తువుల ధరలు పెంచి వారిపైన తీవ్రభారం వేస్తున్నాయని అన్నారు. కార్మికులకు 26వేల కనీస వేతనం ఇవ్వడంతోపాటుగా రైతులకు గిట్టు బాటు ధరను కల్పించాలన్నారు. ఈ మహాసభల కార్యక్రమంకు సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం,రాష్ట్ర నాయకులు పాల్గొం టారని ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని అయన కోరారు. సిపిఎం నాయకులు మల్లయ్య, సాయిలు, ఎంటప్ప,విజయ్‌కుమార్, నర్సిములు పాల్గొన్నారు.

**జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు**

**బొంరాస్‌పేట్, అక్టోబరు17,ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన రాజేష్‌రెడ్డి పార్టీ అధిష్టనం నియమించడంతో బొంరాస్‌పేట్ మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్‌రాములు గౌడ్,పార్టీ నాయకులు కలిసి అయనకు శాలువ పూలదండలతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఎల్లప్పగౌడ్,చిన్న నర్సిములు,వెంకటయ్య,అంజయ్య పాల్గొన్నారు.

## బిటి రోడ్లు మంజూరు చేయాలి

**మద్దూరు, అక్టోబరు 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వంపల్లి నుంచి వల్లంపట్ల, ఉప్పరోని గడ్డ గ్రామాలకు బీటీ రోడ్డు మంజూరు చేయా లని సీపీఎం జిల్లి కార్యవర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ధర్మారం, వంగపల్లి గ్రామాలలో సీపీఎం శాఖ మహా సభలను గురువారం నిర్వహించి ఈ సందర్భంగా పార్టీ జెండాలను ఆవిష్క రించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధర్మారం నుంచి రేబర్తి గ్రామా నికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని వంగపల్లి గ్రామం నుంచి వల్లంపట్ల వంగపల్లి నుంచి ఉప్పరనిగడ్డకు రోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని తెలిపారు.

## విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు



**కోట్‌పల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త:** కోట్‌పల్లి మండలానికి నూతనంగా 2024, డిఎస్సీకి సంబంధించి నాలుగురు ఉపాధ్యాయులు రావడం జరిగిందని అదే విధంగా గత జూలై నెలలో బదిలీపై రావల్సి ఉన్నా ఉపాధ్యాయులు నాలుగురు మొత్తం ఎనిమిది మంది ఉపాధ్యాయులు రావడం జరిగిందని మండల విద్యాధికారి చంద్రప్ప తెలిపారు. గురువారం నాడు మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులను విధుల్లో చేర్చుకోవడం జరిగిందన్నారు. మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను కుడా రిలీవ్ చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు.

## రోడ్ల అభివృద్ధికి నిధుల విడుదల పట్ల హర్షం

**మాడ్గుల, అక్టోబరు17,ప్రభాతవార్త:**-మాడ్గుల మండలంలోని గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి రోడ్లు మరియు భవనాల శాఖ ద్వార నిధులు మంజూరు చేసినట్లు కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి తెలపడంతో మాడ్గుల మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎంతో కాలంగా మాడ్గుల-దేవరకోండ రోడ్డు డబ్బుల్ రోడ్డు కావలని కొరికను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కృషితో సహాకారం అవుతుందని మాడ్గుల, బ్రామణపల్లి,ఆర్కపల్లి,అందుగుల,సుద్దపల్లి తదితర గ్రామల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం కోసం 30కోట్ల నిధులు మంజూరు చేయించిన కసిరెడ్డి నారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిదంగా ఆమన్‌గల్లుమండలంలోని కొనపూరం నుండి ఆకుతోటపల్లి, దొడ్లపహాడ్, అప్పారెడ్డిపల్లి, మాడ్గుల వరకు 45కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పంచాయితీరాజ్ శాఖ నుండి మరో 9కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెలే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. మాడ్గుల ప్రాంతానికి నిధులు కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి,సీతక్క నిధులు రావడానికి కృషి చేసిన ఎమ్మెలే కసిరెడ్డి నారాయణరెడ్డి నాయకులు ఏర్పుల జంగయ్య, పులికంటి లక్ష్మయ్య,అందుగులరాజు,కొప్పుల జగన్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

## పేదవిద్యార్థి చదువుకు ఆర్థిక సహాయం



ఆమనగల్లులో పేద విద్యార్థికి ఆర్థిక సహాయం చేస్తున్న మండ్లి రాములు

**ఆమనగల్లు, అక్టోబరు17, ప్రభాతవార్త:** ఉన్నత చదువులకు ఆర్థిక సమస్య ఎదురుకావడంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థికి ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచారు అనన్య రియల్ ఎస్టేట్ యజమాని మండ్లి రాములు. మండల పరిధిలోని శంకర్‌కొండ గ్రామానికి చెందిన నేనావత్ పాండు కుమారుడు నేనావత్ శ్రీకాంత్ కాన్పూర్ ఐఐటీలో ఇంజనీరింగ్ విద్యనభ్యసిస్తున్నాడు. రెండవ సెమిష్టర్ ఫీజు కట్టడంలో ఇతను ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కాంగ్రేస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు మండ్లి రాములు తెలుసుకుని పేద విద్యార్థి తల్లిదండ్రులను కలుసుకుని భరోసా ఇచ్చారు. రెండవ సెమిష్టర్ ఫీజు రూ. 40వేల రూపాయలు అవసరమైన నేపథ్యంలో అనన్య రియల్ ఎస్టేట్ తరపున రాములు వాటిని సమకూర్చి గురువారం ఆమనగల్లు పట్టణంలోని తన కార్యాలయంలో విద్యార్థికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రేస్ నాయకులు వస్పుల మానయ్య, ఆంజనేయులు, నేనావత్ పత్య, రాజీ, శేఖర్‌రెడ్డి, జగ్గురామ్, చంద్రునాయక్ తదితరులు ఉన్నారు.

## మెలకువలతోనే అధిక దిగుబడి సాధ్యం



మాడ్గుల రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేతలు

**మాడ్గుల, అక్టోబరు17,ప్రభాతవార్త:** పత్తిలో మెలకువలతో అధిక దిగుబడి సాధ్యం అవుతుందని కేంద్రియ పత్తి పరిశోధనా ప్రధాన శాస్త్రవేత్త అమృత అన్నారు. మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం,కేంద్రీయ మెట్ట పరిశోధన స్థానం రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి అనే అంశంపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సాంద్రత పత్తి వేసిన మాడ్గుల రైతుల క్షత్రంలో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. మాడ్గుల రైతువేదిక లో అధికసాంద్రత పత్తివేసిన రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేతలు చంద్రకాంత్, విజయ్‌కుమార్, గౌతమ్ చౌహన్,సునీల్,హరి,మాడ్గుల వ్యవసాయ అధికారి అరుణకుమారి, విస్తరణ అధజకారులు రాజేష్‌నాయక్, జోత్స్న,భార్గవి. ప్రియాంక, పాల్గొన్నారు.

**ప్రపంచ ఆహారదినాన్ని ఆకలిదినంగా జరుపుకున్నాం**

**తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్**

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 17) :** అక్టోబరు 1 నుండి 16 వరకు పప్రంచ ఆహార దినాలను ప్రపంచ ఆకలి దినాలుగా జరుపుకున్నారని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర పద్రాన కార్యదర్శి వెంకటయ్య తెలిపారు. ఇందులో బాగంగా గురువారం తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో పటట్ణంలోని ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆర్డీవోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ వృత్తిదారులైన తమను నైపుణ్యం కలిగిన వ్యవసాయ కూలీలుగా గుర్తించి రోజుకు 850 రూపాయల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈఎస్ఐ బీమా సౌకర్యం కల్పించి, ప్రమాదవశాత్తు మరణిస్తే ఐదు లక్షల రూపాయలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి. వెంకటేశ్వరమ్మ, మల్లెపాగ శ్రీనివాసులు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు జంగయ్య, జిల్లా నాయకులు ఎం.డి. ఖాజా, పాండు, అంతారం విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

**పరిగిలో వాల్మీకి మహర్షికి నివాళులు**

**పరిగి అక్టోబరు17,ప్రభాతవార్త :** పరిగిపట్టణ కేంద్రం,పురపాలక కార్యాలయంలో వాల్మీకి మహర్షీజయంతి సందర్భంగా పురపాలక చైర్మన్ ముకుంద అశోక్ కుమార్,కమిషనర్ వెంకటయ్యలు వాల్మీకి చిత్రపటానికి నివాళలర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మర్యాద పురు షోత్తముడు శ్రీరామచంద్రుడి చరిత్రను,తన రామాయణం ద్వారా సకల మాన వాళికి అందించిన మహనీయులని కొనియాడారు. కౌన్సిలర్స్ రవీంద్ర, వెంకటేష్,పురపాలక అధికారులు మేనేజర్ నరేష్ కుమార్,సీనియర్ అసిస్టెంట్ దశరథం,జూనియర్ అసిస్టెంట్స్ ,పురపాలక,మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జికి సత్కారం**

**సిద్దిపేట రూరల్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా గ్రంథా లయ చైర్మన్‌గా నియమితులైన కేడం లింగమూర్తి గురువారం కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణను పార్టీ క్యాంపు కార్యాల యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ లింగమూర్తి, హరికృష్ణ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసేవారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బొమ్మల యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

# వికాసమే జీవితం.. విద్వేషమే మరణం

**మాజీ ఎమ్మెల్యే టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు**



అధ్యాపకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 17) :** సమాజంలో అన్ని రాజకీయ పార్టీలు అధికారమే పరమావధిగా వ్యవహరిస్తుంటాయని, మంచి విలువైన సమాజ నిర్మాణంలో మాత్రం వెనకబడిపోతుంటారని, వికాసమే జీవితంగా మారాలని, విద్వేషం, సంకుచిత తత్వమే మరణంగా భావించాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ మంజుల, అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్యాంసుందర్, టీడీపీ సీనియర్ నేత అన్మారి వెంకటయ్య తదితర అధ్యాపకులతో మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న అరాచకాలు, నవ సమాజ నిర్మాణం కోసం ఎవరు పాటుపడని తీరు, లోకం కొత్త పోకడల గురించి అనేక సామాజిక అంశాలను బక్కని నర్సింహులు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి మంచి చేయాలని చేసే వారు ప్రస్తుతం కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో ప్రజలే ప్రభువులని, వారే ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. 76 ఏళ్ల స్వాతంత్ర్యం అనంతరం కూడా ఇంకా సమాజంలో అంటరానితనం, ఆకలి చావులు, అసమానతలు పెచ్చుమీరిపోయాయని అన్నారు. ప్రతి వ్యక్తి బాధ్యతగా ఉంటే సమాజంలో అఘాయిత్యాలకు, అసమానతలకు తావు ఉండదన్నారు.

**మాట కాలుష్యం మంచిది కాదు**

సమాజంలో బాధ్యత గల రాజకీయ నాయకులు మాట్లాడేటప్పుడు నోరు జారకుండా అదుపులో పెట్టుకోవాలని బక్కని సూచించారు. నోటి నుండి వచ్చే ప్రతి అక్షరం కాలుష్యంలా ఉండకూడదని ఆయన హితబోధ చేశారు. తప్పులను ఎత్తిచూపి ప్రశ్నిస్తే అందులోని మర్మాన్ని గ్రహించాలి తప్ప, నోరు పారేసుకోవాల్సిన అవసరం రాజకీయ నాయకులకు ఉండొద్దన్నారు. సమాజానికి ఆదర్శవంతంగా ఉండాల్సిన నాయకులు మంచి చెడుల ద్వారా ఎలాంటి ఫలితాలు ఉంటాయో సమాజానికి పరిచయం చేయాలన్నారు. ఇష్టం వచ్చినట్లు పాపాలు జరుగుతున్నాయని ఏదో ఒక రోజు పాపభీతి లేకపోతే నష్టం జరుగుతుందని సూచించారు.

## మండల కేంద్రంలోని సుడిగుండాలను తలపిస్తున్న ప్రధాన రోడ్డు



నవాబు పేట మండల కేంద్రం ప్రధాన కూడలి వద్ద రోడ్డు దుస్థితి

ప్రత్యామ్మాయాలు చూపండి

**నవాబుపేట అక్టోబరు 17 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాధాన రోడ్డు గుంతల పడి వర్షపు నీరు చేరి సుడిగుండాలను తలపిస్తున్న పట్టించుకునే దిక్కులేకపోవడం విడ్డూరమనిఈ రోడ్డు ద్వార నిత్యం రాకపోకలు సాగించే వారు అసహానంవ్యక్తం చేస్తున్నారు. కనీసం ప్రత్మాయ చర్యలు తీసుకోక పోవడం సిగ్గుచేటని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉన్న వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం చేతకాని తనానికి నిదర్శనమని అంటున్నారు. అధికారులను, ప్రజాప్రతినిధులను బండ బూతులు తిడుతున్న తీరువర్ణానాతీతమని తలెత్తుకోలేని దుస్థితి ఏర్పడిందని స్వయంగా ద్వీతీయ శ్రేణినాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యా న్మాయంగా గుంతలు పూడ్చేవేయలేని అచేతన స్థితిలోపాలకులు, అధికారులు ఉన్నారని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోంటున్న ఏలాంటి ప్రత్యన్మయ చర్యలు తీసుకోక పోవడం పరిపాలన దక్షతను ప్రశ్నిస్తున్నదని పరిశీలకులు అభిప్రాయంవ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు కొన్ని సంవత్సరాలుగా వట్టిమీనపల్లి వద్ద ప్రధాన రోడ్డు ధ్వంసమైందని ఇప్పటి వరకు పట్టించుకునే దిక్కులేదని నిత్యం రాకపోకలుసాగించే వారు నరక యాతన పడుతూ నిట్టూరుస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. అన్ని రకాల వాహనాలకు గుంతలు ఇబ్బందిగా మారా యని అందుకే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఇప్పటికే ఎందరో ప్రమాదాలకు గురైన ఘటనలు కోకోళ్ళలని ఇకనైనా పాలకులు, అధికారులు ఉంటే వెంటనే స్పందించి నిబద్దతను చాటుకోవాలని పలువురు కోరుతున్నారు.

**ఉమ్మెంతాల శ్రీనివాస్‌రెడ్డికి పితృ వియోగం**

**పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి**

**కొందుర్గు, ప్రభాతవార్త, (అక్టోబరు 17) :** షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలం ఉమ్మెంతాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి తండ్రి రాంరెడ్డి ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు తాండ్ర కాశీనాథ్ రెడ్డిలు గ్రామానికి చేరుకొని శ్రీనివాస్ రెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాంరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి వెంట కాశీనాథ్ రెడ్డి, రమేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఉద్యమాల పార్టీ బీఎస్పీ



జిల్లా ఇంచార్జి దొడ్డి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బీఎస్పీ నాయకులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 17) :** బీఎస్పీ పార్టీ ఉద్యమ పార్టీ అని రంగారెడ్డి జిల్లా ఇంచార్జి దొడ్డి శ్రీనివాస్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లా ఇంచార్జి దొడ్డి శ్రీనివాస్ ఎంపిక కావడం పట్ల బీఎస్పీ కార్యకర్తలు ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దొడ్డి శ్రీనివాస్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పక్షాన పోరాడే పార్టీ బీఎస్పీ పార్టీ అని అన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు ప్రతిఫలం లభిస్తుందని తెలిపారు. పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇంచార్జి, జిల్లా కార్యదర్శి గుండేటి నర్సింలు, నియోజకవర్గ బీవీఎఫ్ కో కన్వీనర్ అంతారం శ్యామ్, ఆయా మండలాల అధ్యక్షులు తుప్పరి కుమార్, సొంటి శ్రీనివాస్, ఎట్రుక్ల కృష్ణ, నాయకులు అబ్బి జగన్, అశోక్, చెన్నయ్య, శివగళ్ల ఆంజనేయులు, కొండేటి మహేందర్, ఎగిరే సుదర్శన్, పాల్గొన్నారు.

**బిజెపి పదాధికారుల సమావేశం.. పాల్గొన్న రమేష్‌గౌడ్**

**నర్సాపూర్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని బిజెపి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర పదాధికారుల రివ్యు సమావేశంలో నర్సాపూర్ పట్టనానికి చెందిన బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర బిజెపి ఓబిసి అధ్యక్షులు ఆనంద్‌గౌడ్, ఈఎస్ ఈశ్వరప్ప, నందనం దివాకర్ లు పాల్గొని ఓబిసి రాష్ట్ర నాయకులు తదితరులు పదాధికారుల సభ్యత్వాల గురించి పలు సూచనలు సలహాలను ఇవ్వడం జరిగింది. ఈ మేరకు బిజెపి సభ్యత్వాలను ఎక్కువ గా నమోదు చేయించి రాష్ట్రంలో బిజెపి పార్టీని మరితం భలోపేతం చేయాలని వారు వెల్లడించారు. ఈకార్యక్రమంలో బిజెపి పార్టీ వివిద జిల్లా ఇన్చార్జులు, ఓబిసి నాయకులు తదితరులుపాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**నర్సాపూర్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** పట్టణంలోని ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో వెల్దుర్తి మండలం హస్థల్‌పూర్ గ్రామానికి చెందిన బత్తుల రామమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 16 వేల రూపాయిల చెక్కును, అదేవిదంగా హత్నూర మండలం సాదుల్‌నగర్ గ్రామానికి చెందిన తలారి శ్రీనివాస్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 60 వేల రూపాయిల చెక్కును, ఈ రెండు చెక్కులను కాంగ్రెస్ పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సాపూర్‌నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ ల చేతుల మీదుగా బాధితుడు కుమార్ అందజేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్,జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, టిపిసిసి రాష్ట్ర నాయకులు సోమన్నగారి రవిందర్‌రెడ్డి, మం డల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేశం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, ఓబిసి సెల్ మండల అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్,పట్టణ వర్కింగ్ ప్రసిడెంట్ రశీద్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధనయక్షుక్షులు హరీశ్‌వర్ధన్, నాయకులుఎద్దు మల్లేష్‌యాదవ్,రామాగౌడ్ తో పాటు కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఉత్తమ విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేత**

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** స్వచ్చత హి సేవా, స్వచ్ఛ హుస్నాబాద్ కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ మున్సిపల్ ఆధ్వ ర్యంలో ఇటీవల నిర్వహించిన తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ వాడకంపై వ్యాస రచన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠ శాల 9వ తరగతి విద్యార్థిని ఎ.హర్షితకు గురువారం 11వ వార్డు కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్ ప్రిన్సిపాల్ వెంకటయ్యతో కలసి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, వార్డ్ ఆఫీసర్ శారద పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ టీచర్ల వేతనాలు విడుదల చేయాలి**



సిడిపిఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

**పరిగి అక్టోబరు 17,ప్రభాతవార్త :** రాష్ట్రంలో 4000 మందికిపైగా అంగన్‌వాడీ టీచర్లకు ఐదు నెలల పెండింగ్ వేతనాలు అందట్లేదని తక్షనమే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రామకృష్ణ ,అంగన్‌వాడీ టీచర్లతో పరిగి సిడిపిఓ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. రామకృష్ణ మాట్లాడుతూ...అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు అందించాలని,హెల్పర్స్‌ను నియమించడంతో పాటు ఖాళీ పోలీసులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మినీ అంగన్‌వాడీ టీచర్లను 2024 జనవరి 1 నుండి మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వేతనాలు విడుదల చేసి అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరసమ్మ,పరిగి ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు మంజుల ,స్వరూప,టీచర్లు శ్వేత,నిర్మల ,కమల దేవి,శాంతి,సునీత,రుకీ భాయ్,తదితరులు పాల్గొన్నారు.

**ఏఎంసీ డైరక్టర్ మచ్చేంధర్‌రెడ్డికి సన్మానం**



మచ్చేంధర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ఘట్‌కేసర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త:** గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన చిలూ 2రి మచ్చేంధర్‌రెడ్డిని ఘట్‌కేసర్ కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. పట్టణంలోని ఓఫంక్షన్‌హాలులో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్ ఆధ్వర్యంలో మచ్చేంధర్‌రెడ్డిని శాలువాతో సన్మానించి అభినందించారు. ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్, మాజీ ఎంపిటిసి సభ్యురాలు సగ్గు అనితతో పాటు నాయకులు పాల్గొని మచ్చేందర్‌రెడ్డిని సత్కరించారు. కొండాపూర్‌కు చెందిన మచ్చే ందర్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీలో సీనియర్ నాయకునిగా ఉంటూ పార్టీకి సేవలందిస్తున్నందున కాంగ్రెస్ ప్రభుత్వం గడ్డిఅన్నారం ఎఎంసీ డైరక్టర్‌గా నియమించిందని, కష్టపడి పని చేసే నాయకులకు ఎప్పటికైనా తగిన గుర్తింపు లబిస్తుందని. వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ కడుపోల్ల మల్లేశ్, డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మున్సిపల్ ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, మాజీ వార్డుసభ్యులు మీసాల సుధాకర్‌రావు, బొంత వెంకటేశ్, పట్టణ మాజీ అధ్యక్షులు మెరుగు నరేశ్‌గౌడ్, మైనారిటీ సెల్ నాయకులు ఎం.ఎ.రహమాన్, ఫారూఖ్, అశ్రఫ్‌అలీ పాల్గొన్నారు.

## రైతు సేవ సహకార సంఘానికి సభ్యులే దేవుళ్లు

**పాపన్నపేట, అక్టోబరు 17, ప్రభాతవార్త:**

రైతు సేవా సహకార సంఘానికి రైతు సభ్యులే దేవుళ్లని, వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నామని రైతు సేవ సహకార సంఘం చైర్మన్ త్యార్ల రమేష్ గుప్తా అన్నారు. గురువారం సొసైటీ ఆధ్వర్యంలో కొత్తపల్లిలోని అనంత పద్మనాభస్వామి ఫంక్షన్ హాల్ లో మహజనసభను నిర్వహించారు. ఈ సందర్భం గా చైర్మన్ రమేష్‌గుప్తా మాట్లాడుతూ సంఘం ఈ ఏటా రూ. 2.47కోట్ల లాభంతో నడుస్తోందని గుర్తు చేశారు. సంఘానికి సమకూరిన లాభం సంఘం సభ్యులకు 10 శాతం పంపిణీ చేస్తామన్నారు. సొసైటీ పరిధిలో నడుస్తున్న పెట్రోల్ బంక్‌ను కన్స్యూమర్ పంపు నుండి డీలర్ పంపునకు మార్చిన ఘనత మాకే దక్కుతుందన్నారు. సొసైటీ పరిధిలో రెండు కోట్లపై చిలుకు మాటిగేజ్ రుణాలు అందచేశామ న్నారు. సొసైటీ పరిధిలో అన్ని రకాల రుణాలను రైతులకు అందచేసినట్లు వివరించారు. అసైన్ ల్యాండ్ రైతులకు సైతం రుణాలను త్వరలో అంద చేయనున్నట్లు ప్రకటించారు. సొసైటీ పరిధిలోని రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు అందచేస్తున్నామన్నారు. రైతులు డీలర్ల వద్ద కాకుండా సొసైటీ పరిధిలో కొనుగోలు చేయాలని సూచించారు. సొసైటీ అభి వృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి సభ్యులు లొంగన్న గారి మల్లన్న, ఏడుపాయల మాజీ చైర్మన్లు పబ్బతి ప్రభాకర్‌రెడ్డి, పార్వ నర్సింలు, వెంకటేశ్వర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు